# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 148 | హైదరాబాద్ | శుక్రవారం 28-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

హాంకాంగ్ అగ్నిప్రమాదం... 24 గంటల తర్వాత 16వ అంతస్తు నుంచి వ్యక్తిని రక్షించిన సిబ్బంది



## ఆన్‌లైన్ కంటెంట్‌పై

# బాధ్యత ఉండాల్సిందే

- ఆన్‌లైన్ కంటెంట్‌కు జవాబుదారీతనం తప్పనిసరి అన్న సుప్రీంకోర్టు
- సొంత ఛానల్ ఉందని బాధ్యతారాహిత్యంగా ఉండటం సరికాదని కీలక వ్యాఖ్యలు
- యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా వివాదంపై విచారణ
- వినియోగదారుల కంటెంట్ నియంత్రణపై కేంద్రానికి ఆదేశాలు
- నిబంధనల రూపకల్పనకు నాలుగు వారాల గడువు

11లో

## ప్రపంచానికే ఆదర్శం

# మన యువత..

వారి వల్లే స్టార్టప్ విప్లవం సాధ్యమైంది: ప్రధాని మోదీ

11లో

- భారత జెన్-జెడ్ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు
- వారి ఆత్మవిశ్వాసం ప్రపంచానికే ఆదర్శమన్న ప్రధాని
- అంతరిక్ష రంగంలో 300కు పైగా స్టార్టప్‌ల ఏర్పాటు
- దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌లతో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- యాప్‌ల నుంచి డీప్-టెక్ వైపు యువత అడుగులు





11లో

## హసీనా అప్పగింతపై

# భారత్ కీలక ప్రకటన..

- అభ్యర్థన పరిశీలనలో ఉందన్న ప్రభుత్వం
- మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని భారత్‌ను కోరిన బంగ్లాదేశ్
- అభ్యర్థనను పరిశీలిస్తున్నామని అధికారికంగా తెలిపిన భారత్ విదేశాంగ శాఖ
- మానవతా వ్యతిరేక నేరాల కింద హసీనాకు ఇటీవల మరణశిక్ష విధించిన ట్రైబ్యునల్
- హసీనా విచారణ ప్రక్రియలో లోపాలున్నాయని భారత్ ప్రాథమిక అంచనా

# డెంగీకి.. సింగిల్ డోస్ వ్యాక్సిన్..

## ప్రపంచంలోనే తొలిసారి!

- బ్రెజిల్‌లో బుటాంటన్ ఇనిస్టిట్యూట్ అభివృద్ధి చేసిన వ్యాక్సిన్
- తీవ్రమైన డెంగ్యూపై 91.6 శాతం సమర్థత చూపిన టీకా
- వాతావరణ మార్పులతో ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డెంగీ కేసులు



11లో

## శ్రీవారి సేవకులుగా

# వైద్య నిపుణులు...

శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులు...



11లో

- టీటీడీపై సీఎం చంద్రబాబు సమీక్ష
- నలుదిశలా తిరుమల ఆధ్యాత్మిక వైభవాన్ని చాటాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో తిరుమల తరహా విధానాలు అమలు చేయాలని సూచన
- వైద్య నిపుణులను శ్రీవారి సేవకులుగా ఆహ్వానించి సేవలు



## సెకండ్ హ్యాండ్ కార్లకు పెరుగుతున్న గిరాకీ..

- కొత్తవాటిని మించిపోతున్న అమ్మకాలు!

11లో



## ఇమ్రాన్ ఖాన్

# పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు

## : జైలు అధికారుల వెల్లడి

- జైల్లో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మృతి అంటూ వదంతులు
- పుకార్లను ఖండించిన రావల్పిండి అడియాలా జైలు అధికారులు
- ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంగానే ఉన్నారని స్పష్టత

భారత శక్తి
VOICE OF INDIAN

# బలపడుతున్న మాతృశక్తి

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరం ఎవరెస్టును రెండుసార్లు అధిరోహించిన భారత మహిళ సంతోష్ యాదవ్‌ను తమ వ్యవస్థాపక దినోత్సవానికి ఆహ్వానించి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఒక కొత్త చర్చకు తెరతీసింది. అసలు మహిళలపై ఆరెస్సెస్ వైఖరి మారుతోందా? అనే ప్రశ్న కూడా ఉత్పన్నం అవుతోంది. సంఘ్ పరివార్ నిబంధనల ప్రకారం, కేవలం “హిందూ పురుషులు”లు మాత్రమే ఆరెస్సెస్‌లో సభ్యులు కాగలరు. మహిళలకు ఇక్కడ ప్రత్యేక విభాగం ఉంది.దసరా రోజు ప్రసంగానికి ముందుగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ దుర్గాదేవి పూజ చేశారు. ఆరెస్సెస్‌లో ఉదయం నిర్వహించే “శాఖ” మినహా.. మిగతా పనులన్నింటిలోనూ పురుషుల్లానే మహిళలు కూడా పాలుపంచుకుంటారని ఆ ఆరోజు ఆయన చెప్పారు.ఇప్పుడు తాజాగా సంతోష్ యాదవ్‌తో ఆయన వేదిక పంచుకొని మహిళలపై తమ వైఖరి మారుతోందని చెప్పే చర్చను మరో అడుగు ముందుకు తీసుకెళ్లారు. అంతేకాదు.. అంతటా శాంతి, పవిత్రతలు నెలకొనేలా చూడటంలో స్త్రీ శక్తికి ప్రాధాన్యం ఇవ్వడం అనివార్యం’’అని కూడా ఆయన అన్నారు.మహిళల గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ “రాష్ట్ర సేవిక సమితి” పేరును ఆరెస్సెస్ ముందుకు తీసుకొస్తుంది. సంఘ్‌లో ఇది మహిళల విభాగం. అయితే, దీని పేరు పెద్దగా వినిపించదు.నిజానికి సేవిక సమితిని కూడా ఆరెస్సెస్ అనే పిలుస్తారు. దీన్ని కూడా ప్రధాన ఆరెస్సెస్‌లానే విజయ దశమి రోజు కేశవ్ బలిరామ్ హేగ్డేవార్ మొదలుపెట్టారు.సంఘ్‌లో పురుషాధిపత్యంపై చాలా చర్చ జరుగుతుంటోంది. ఈ వైఖరిని మార్చే ప్రయత్నాల్లో భాగంగానే ప్రస్తుతం సంతోష్ యాదవ్‌ను ఆహ్వానించినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇదివరకు కూడా కాంగ్రెస్ నాయకురాలు రాజ్‌కుమారి అమృత్ కౌర్, మాజీ ఎంపీ అనుసూయ బాయి కాలే ఇలా మరికొంత మంది ప్రముఖులను కూడా ఇదివరకు ఆరెస్సెస్ ఇలా ఆహ్వానించింది.భారత సంప్రదాయంలో స్త్రీ, పురుషులను ఒకరికొకరు తోడు-నీడగా మోహన్ భాగవత్ చెబుతుంటారు. “విదేశీ దండయాత్రల వల్ల ఈ సంప్రదాయం పూర్తిగా దెబ్బతింది. అయితే, పూజించడం లేదంటే రెండో తరగతి పౌరులుగా వంటగదికే పరిమితం చేయడం లాంటివి ఎక్కువయ్యాయి. నేడు మళ్లీ మాతృశక్తికి సాధికారత కల్పించాలి. ఉద్యోగం, కుటుంబం, ప్రజాజీవనం ఇలా అన్నింటిలోనూ వారికి సగ భాగం ఇవ్వాలి”అని ఆయన చెప్పారు.ఇటీవల సమాజంలోని భిన్న వర్గాలకు చెందిన ప్రతినిధులతో ఆరెస్సెస్ చర్చలు మొదలుపెట్టింది. సామాజిక సమస్యలు, కుల వివక్ష లాంటి అంశాలపై ఇమామ్ షాహిబ్‌తో మాట్లాడేందుకు మోహన్ భాగవత్ ముస్లింల ప్రార్థనా స్థలానికి కూడా వెళ్లారు. దీంతో ఆరెస్సెస్ వైఖరిలో మార్పు వస్తోందనే చర్చ ఎక్కువైంది.సమాజంలో తమపై పడిన ముద్రను చెరిపేసుకోవడానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి రాజకీయ లబ్ధి చేకూర్చేందుకు నేడు సంఘ్ తీవ్రంగా ప్రయత్నిస్తోందని రాజకీయ విమర్శకులు అంటున్నారు. అయితే, మహిళల విషయంలో గత మూడు దశాబ్దాలుగా ఆరెస్సెస్ వైఖరి మారుతూ వస్తోందని సంఘ్ మద్దతుదారులు అంటున్నారు.మీారు ప్రసంగంలో భాగవత్ వాడిన పదాలను జాగ్రత్తగా గమనించండి. దానిలో పురుషాధిక్య పదజాలం చాలా కనిపిస్తుంది. అసలు సంప్రదాయ కుటుంబ వ్యవస్థకు వెలుపల మహిళలు జీవించలేరనే ధోరణిలో ఆయన మాట్లాడారు. మహిళలకు వారి శరీరాలపై వారికి హక్కులు ఇచ్చేందుకు సంఘ్ సిద్ధంగా లేదు”అని దిల్లీ జవహర్‌లాల్ యూనివర్సిటీలోని సోషియాలజీ ప్రొఫెసర్ హరీశ్ వాంఖడే అన్నారు.మోహన్ భాగవత్ తన ప్రసంగంలో మహిళల గురించి మాట్లాడేటప్పుడు పదేపదే “మాతృ-శక్తి’’ అనే పదాన్ని ఉపయోగిస్తూ కనిపించారు. ముఖ్యంగా మహిళల జీవితంలో “మాతృత్వం” అనే అంశానికి ఆరెస్సెస్ ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తుంటుంది.నాగ్‌పూర్‌కు చెందిన మరాఠీ రచయిత అరుణ సబానే ఈ విషయంపై మాట్లాడుతూ.. “తల్లి అనే పదం వారికి ఒక లక్ష్మణ రేఖ లాంటిది. మహిళలు ఈ గీత దాటి ముందుకు రాకూడదని వారు భావిస్తారు”అని ఆమె అన్నారు. 1987 నుంచీ సంఘ్‌లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం క్రమంగా పెరుగుతూ వస్తోందని ఏళ్ల నుంచీ ఆరెస్సెస్‌లో పనిచేస్తున్న దిలీప్ దేవధర్ అన్నారు. “ఇక్కడ సంఘ్‌లో ఒక కుటుంబ సభ్యుడు చేరితే, ఆ కుటుంబం మొత్తం దానిలో చేరినట్లే. ఇక్కడ పురుషులతోపాటు మహిళలు కూడా సంఘ్‌లో చేరినట్లుగానే భావించాలి”అని ఆయన వివరించారు.అయితే, సంఘ్‌లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందనే విషయాన్ని దిలీప్ అంగీకరించారు. “సమాజంలో మహిళల సంఖ్యతో పోలిస్తే, వారికి సముచిత స్థానం లభించడంలేదు”అని ఆయన అన్నారు.ఎనిమిదేళ్ల విరామం తర్వాత, నేను మళ్లీ సంఘ్ విజయదశమి కార్యక్రమానికి మళ్లీ హాజరయ్యాను. ఇక్కడ ముఖ్య అతిథుల్లో చాలా మంది కనిపించారు. అయితే, “పార్థ్ సంచాలన్” సహా కొన్ని కార్యక్రమాల్లో మహిళలు కనిపించలేదు. ఈ విషయంపై అక్కడ వాలంటీర్లతో మాట్లాడినప్పుడు.. “కొన్ని కార్యక్రమాల్లో మహిళలు పాల్గొనని మాట వాస్తవమే. దీని బట్టి సంఘ్‌లో మహిళలే లేరని అనుకోకూడదు. ఆరెస్సెస్‌లో చాలా మంది మహిళలు సేవలు అందిస్తున్నారు. సంఘ్‌లో వారి పాత్ర క్రమంగా పెరుగుతోంది”అని అక్కడున్న వారు చెప్పారు.మరో వాలంటీర్ మాతో మాట్లాడుతూ.. “సంఘ్‌లో మొత్తంగా 36 సంస్థలు ఉన్నాయి. వీటిలో రాష్ట్ర సేవిక సమితి కూడా ఒకటి. ఇక్కడ అన్ని సంస్థలూ కలిసి పనిచేస్తాయి. అంతేకానీ, మహిళల విషయంలో ఎలాంటి వివక్షా ఉండకూడదు”అని అన్నారు.సేవిక సమితిని ఆరెస్సెస్‌తో సమానమని సంఘ్ పరివార్ చెబుతుంటుంది. దేశ పునర్నిర్మాణంలో సంఘ్‌లోనే ఇది కూడా పనిచేస్తోందని వివరిస్తోంది.ఆరెస్సెస్ విద్యార్థి విభాగం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రధాన కార్యదర్శి నిధి త్రిపాఠి కూడా ఈ విషయంపై మాట్లాడారు. “మాతృత్వాన్ని ప్రతికూల కోణంలో ఎప్పుడూ చూడకూడదు. మహిళలకు భిన్న రకాల శక్తి సామర్థ్యాలు ఉంటాయి. లక్ష్మీ బాయిని తీసుకోండి.

# టమోటా ధరలకు రెక్కలు

తిరుపతి, నవంబర్ 27,

టమోటా ధరలకు రెక్కలు వచ్చాయి. ఉన్న పళంగా బంగారం లాగానే ధరలు పెరుగుతున్నాయి. మదనపల్లి మార్కెట్ లో కిలో రూ. 63 టమోటా ధర తలుకుతుండగా గత పది రోజులుగా క్రమేణ పెరుగుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని పడమటి మండలాల్లో ప్రధాన ఆదాయ పంటగా టమోటా సాగు చేస్తున్న రైతులు ధర ఉన్న దిగుబడి లేక దిగాలు చెందుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మదనపల్లి,తంబళ్లపల్లి పుంగనూరు పలమనేరు నియోజకవర్గాల్లోనే దాదాపు 10 వేల హెక్టార్లలో టమోటా సాగు చేసిన రైతులు దిగుబడి కూడా ఆశాజనకంగానే ఉంటుందని భావించారు. సీజన్ ముగుస్తున్న సమయంలో మొంథా తుఫాను, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దిగుబడి తగ్గింది. వర్షాల వల్ల చీడ పురుగులతో తెగుళ్ల బెడద రైతులకు ఇబ్బందిగా మారడంతో పాటు దిగుబడి కూడా తగ్గేందుకు కారణమైంది.వర్షాల కారణంగా తేమశాతం అధికం కావడం, టమోటా మచ్చలు ఏర్పడడంతో పాటు పొలాల్లోనే కుళ్ళిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో దిగుబడిపై ప్రభావం పడటం వల్ల మదనపల్లి మార్కెట్ కు దిగుబడి తగ్గింది. గతేడాది ఇదే సమయంలో రోజు సగటున దాదాపు 700 మెట్రిక్ టన్నుల టమోటా మదనపల్లి మార్కెట్ కు రాగా ప్రస్తుతం 150 మెట్రిక్ టన్నులకు దిగుబడి పడిపోయింది. మదనపల్లి సరిహద్దున ఉండే కర్ణాటక ప్రాంతంలోని కోలారు, చింతామణి, ముల్బాగల్ ప్రాంతాల నుంచి కూడా ఆశించిన మేర మదనపల్లి మార్కెట్ కు టమోటా దిగుబడి కాకపోవడంతో ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి.తగ్గట్టుగా మదనపల్లి మార్కెట్ లో టమోటా అందుబాటులో లేకపోవడం, మరోవైపు టమోటా కొనుగోలుకు బయట నుంచి ట్రేడర్లు కూడా ఆసక్తి చూపుతున్నడంతో మదనపల్లి మార్కెట్లో టమోటా కు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలోనే గత 10 రోజుల క్రితం రూ.10 పలికిన కిలో టమోటాధర ఇప్పుడు ఏకంగా రూ. 60 కు పైగానే ఉంటోంది. మొంథా తోపాటు వరుసతుఫానుల ప్రభావంతో కురుస్తున్న వర్షాలు కారణంగా టమోటా ధరలు పెరుగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తగ్గిన దిగుబడి తో నిన్న మదనపల్లి మార్కెట్ కు వచ్చిన 140 మెట్రిక్ టన్నుల టమోటా రాగా మొదటి రకం కిలో టమోటా ధర రూ. 52 నుంచి రూ.63 వరకు పలుకగా



రెండో రకం ధర రూ. 33 నుంచి 50 లు దాకా పలికింది. దీంతో ధరలు ఆశాజనకంగా ఉన్న దిగుబడి టమోటా సాగు చేసిన రైతులను పెరుగుతున్న ధరలు ఊరించని పరిస్థితి నెలకొంది.

==============

# టీడీపీలో పంచాయితీలు



కడప, నవంబర్ 27,

తెలుగుదేశం పార్టీకి ఈసారి ఏంటో కానీ అధినాయకుడు ఒకవైపు లాగుతుంటే.. ఎమ్మెల్యేలు మరొక వైపు లాగుతున్నారు. ముఖ్యంగా ఈ టర్మ్ లో మాత్రం టీడీపీని దారుణంగా నష్టపరుస్తుంది ఖచ్చితంగా ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే. ఎందుకంటే గతంలో ఇలాంటి పరిస్థితులు ఉండేవి కావు. తమ నియోజకవర్గంలో ఏదైనా సమస్యలున్నా అధినాయకత్వంతో చెప్పుకునే వారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. నాయకత్వం మాట పెడచెవిన పెట్టి తాము అనుకున్నది మీడియా ముందు చెప్పేస్తున్నారు. దీంతో టీడీపీకి భారీగా డ్యామేజీ అవుతుంది. తాజాగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరద రాజులు రెడ్డి కూడా అలాంటి కోవలోకి వెళ్లినట్లే కనిపిస్తుంది. అసలే రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తుందని వైసీపీ చేస్తున్న విమర్శలకు వరదరాజులు రెడ్డి వంత పాడినట్లుంది.. ప్రొద్దుటూరులో బంగారం వ్యాపారాలకు కొదవలేదు. బంగారం దుకాణాలు లెక్కకు మించి ఉన్నాయి. అయితే బంగారం వ్యాపారులను బెదరించి పోలీసులు ప్రయివేటు పంచాయతీలు చేస్తున్నారని సాక్షాత్తూ ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి పోలీసులపై ఫైర్ అవ్వడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారింది. రాజకీయం కోసం బంగారం వ్యాపారులకు అండగా ఉండటంలో తప్పులేదు. కానీ అదే సమంయంలో ప్రభుత్వంలో ఉన్న సమయంలో పోలీసులపై నెగిటివ్ కామెంట్స్ చేయడం ఇప్పుడు హాట్ హాట్ గా మారింది. బంగారు వ్యాపారి శ్రీనివాసులును అన్యాయంగా అరెస్ట్ చేశారని, ఏడు కోట్ల రూపాయల అప్పు వసూళ్లలో పోలీసులు ప్రమేయం ఉందని వరద రాజులు రెడ్డి చెప్పారు తమ విధులను మానేసి ప్రయివేటు పంచాయతీలు చేయడం, సివిల్స్ తగాదాల్లో తలదూర్చడమేంటని అధికార పార్టీ ఎమ్మెల్యేనే ప్రశ్నించడం ఇప్పుడు వైసీపీకి కలసి వచ్చింది. పోలీసుల వ్యవహార శైలిని టీడీపీ ఎమ్మెల్యేలే తప్పుపడుతున్నారంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. ఇక వైసీపీ సంగతి పక్కన పెడితే అసలు అధికారంలో ఉన్నప్పుడు ఏదైనా జరిగితే అది ఉన్నతాధికారుల దృష్టికో, జిల్లా ఇన్ ఛార్జి మంత్రికో చెప్పి పరిష్కరించుకోవాలని, లేకుంటే హైకమాండ్ ను సంప్రదించాలని, అంతేకాని ఇలా మీడియా సమావేశాలు పెట్టి పోలీసుల తీరును విమర్శించడం కేవలం హోం మంత్రిత్వ శాఖకు మాత్రమే కాదు...చంద్రబాబు సర్కార్ పైన కూడా పడుతుందన్నది ఈ పెద్దాయనకు తెలియదా? అంటే తెలుసు. ఎందుకు తెలియదు. అయినా అన్నారంటే డోన్ కేర్ అన్నమాటేగా.

## హెచ్ ఎండీఏ లేఔట్లకు 100 కోట్లు దాటేసింది

హైదరాబాద్, నవంబర్ 27

అప్పట్లో కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నియో పోలిస్ ప్రాంతంలో హెచ్ఎండిఏ అభివృద్ధి చేసిన లే అవుట్లను వేలం వేస్తే ఎకరం 100 కోట్లు పలికింది. అప్పట్లో దానిని తమ ప్రభుత్వం గొప్పతనానికి నిదర్శనమని గులాబీ పార్టీ పేర్కొంది. తన కరపత్రిక నమస్తే తెలంగాణలో బీభత్సంగా రాసుకుంది.. అంతేకాదు అధికారం పైన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా అనే వ్యవస్థ వల్ల సర్వం నాశనం అయిందని శోకాలు పెట్టింది. కానీ ఇప్పుడు గులాబీ పార్టీ అధికారంలో ఉన్న దాని కంటే ఇంకా ఎక్కువకే భూములు అమ్ముడుపోతున్నాయి. కోకాపేట ప్రాంతంలో హెచ్ఎండిఏ అభివృద్ధి చేసిన భూములను వేలం వేస్తే ఎకరం ధర 137 కోట్లు పలికింది.కోకాపేట ప్రాంతంలో ఎకరం 137 కోట్లు పలకడం హై ఎండ్ ప్రైస్ అని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఊహించిన విధంగా భూములకు డిమాండ్ ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని వారు అంటున్నారు. కోకాపేట ఒకప్పుడు బయటి ప్రాంతంగా ఉండేది.. అయితే బాహ్యవలయ రహదారి వల్ల ఒక్కసారిగా ఈ ప్రాంతానికి డిమాండ్ పెరిగింది.. అనేక కమర్షియల్ ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి వచ్చాయి.. అందువల్లే ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. అందువల్లే బిడ్డర్లు పోటీపడి భూములను సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

# పవన్ ఎందుకీ మౌనం



కడప, నవంబర్ 27, (న్యూస్ పల్స్)

జనసేన అధినేత పవన్ కల్యాణ్ గత ఎన్నికలకు ముందు అధికారంలో లేరు. అప్పుడు వైసీపీ అధికారంలో ఉంది. అందుకే ఏ రకమైన విమర్శలు చేయడానికైనా ఎన్నికల సమయంలో వీలవుతుంది. కానీ వచ్చే ఎన్నికల నాటికి పవన్ చేతిలో ఉన్న పవర్ అస్త్ర మాత్రం పవర్ అయిపోయిందనే చెప్పాలి. ఇప్పుడు జగన్ ను విమర్శిస్తే కుదరదు. కేవలం కూటమి ప్రభుత్వంలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించే చెప్పుకుని ప్రజల ముందుకు వెళ్లాలి. అతి అంత సులువు కాదు. ఎప్పుడైనా నెగిటివ్ వ్యాఖ్యలకు ఉన్న పాజిటివిటీ ప్రజల్లో పాజిటివ్ కామెంట్స్ కు ఉండదు. ఇది గత కొన్ని దశాబ్దాలుగా రాజకీయాలను చూస్తున్న వారికి ఎవరికైనా ఇలాగే అర్థమవుతుందిఅందుకే పవన్ కొత్త అస్త్రాన్ని అందుకోవాల్సి ఉంటుంది. ఒకవైపు జనసేన క్యాడర్ తో పాటు కాపు సామాజికవర్గం కూడా పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. ఆ విషయంలో మాత్రం పవన్ కల్యాణ్ స్పష్టత ఇవ్వలేని పరిస్థితి ఉంది. ఎందుకంటే ఇప్పటికే పలు మార్లు పవన్ కల్యాణ్ పదిహేనేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటారని ప్రకటించారు. దీంతో ఆ అస్త్రం కూడా పవన్ చేతులో లేదు. ఇక కూటమి ప్రభుత్వం రెండోసారి ఎన్నికైతే అభివృద్ధి కొనసాగుతుందని చెప్పి ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. అది చప్పగా ఉంటుంది. తప్పించి ప్రజలకు రుచించదు. జగన్ ను విమర్శించినా, వైసీపీ పాలనలో లోపాలను ఎత్తి చూపినా అవుట్ డేటెడ్ అవుతాయి. అందులోనూ విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలోనూ చివరకు రాజధాని అమరావతి రైతుల అవస్థల విషయంలోనూ పవన్ కల్యాణ్ మౌనంగా ఉండటం కొంత ఇబ్బందికరంగా మారనుంది. ఇక ఆయన నిజాయితీపరుడైనా సొంత పార్టీ ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడటంతో పాటు టీడీపీ అనుకూల మీడియాలోనూ వ్యతిరేక వార్తలు వస్తుండటంతో ఇప్పుడు పవన్ కల్యాణ్ జనం వద్దకు వెళ్లాలంటే ఏం చేయాలన్న దానిపై కొంత తర్జనభర్జన పడుతున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో అనేక విషయాలు కలసి వస్తాయని నమ్ముతున్నారు. అన్నీ కలసి వచ్చి తమను రెండోసారి అధికారంలోకి తెస్తాయని భావిస్తున్నారు. మరి జరుగుతుందన్నది చూడాలి.

రైతుల కోసం వ్యూహం

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధ్యతగా వ్యవహరిస్తారు. మాట్లాడేటప్పుడు కూడా జాగ్రత్తగా ఉంటారు. తాను కూటమిలో కీలక భాగస్వామి అని.. తన మాటే చెల్లుబాటు అవుతుందని ఎన్నడూ చెప్పరు. అయితే ఈ విషయంలో జనసైనికులు భిన్నంగా ఉంటారు. తమ నేత వల్లే కూటమి అధికారంలోకి వచ్చిందని మాట్లాడుతుంటారు. అయితే ఆ మాటలు కూటమికి ఇబ్బందికరం అని పవన్ కళ్యాణ్ కు తెలుసు. అందుకే అటువంటి వ్యాఖ్యలకు దూరంగా ఉంటారు పవన్ కళ్యాణ్. తాజాగా కోనసీమలో కొబ్బరి రైతుల సమస్యలను స్వయంగా పరిశీలించారు పవన్ కళ్యాణ్. అక్కడ ఉప్పు నీటితో కొబ్బరి పంటకు నష్టం జరుగుతుందని తెలిసి పరామర్శకు వెళ్లారు. ఇలా వెళ్లే క్రమంలో చాలా బాధ్యతగా మాట్లాడారు. తాను ఇప్పటికిప్పుడు సమస్యను పరిష్కరించే ముఖ్యమంత్రి హోదాలో లేనన్న విషయాన్ని గుర్తు చేసి.. సీఎం చంద్రబాబుతో చర్చించి మంచి నిర్ణయం తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు.వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు వ్యవస్థలను వెంటాడుతున్నాయని పవన్ కళ్యాణ్ ఆవేదనతో ఉన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు డబ్బులు ఇస్తే చాలదని.. వారు పడుతున్న సమస్యలకు పరిష్కార మార్గం చూపించాల్సిన అవసరం ప్రభుత్వం పై ఉందని అభిప్రాయపడ్డారు. తద్వారా గత ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలను అమలు చేసి పాలనను గాలికి వదిలేసిందని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి చేసిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. తద్వారా గత ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపే ప్రయత్నం చేశారు పవన్ కళ్యాణ్. ఈ క్రమంలో వెంటనే తాను పరిష్కార మార్గం చూపించే ప్రయత్నం చేస్తానని అతిగా హామీ కూడా ఇవ్వలేదు.అయితే తాను సీఎం హోదాలో లేనని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించిన క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రంగంలోకి దిగింది. పవన్ కళ్యాణ్ సీఎం పదవి ఆశిస్తున్నారని ప్రచారం చేస్తోంది. వాస్తవానికి గత ప్రభుత్వం కోనసీమ కొబ్బరి రైతుల సమస్యలను పట్టించుకోలేదన్నది పవన్ ఆవేదన. సీఎం చంద్రబాబుతో చర్చించి ఆ సమస్యకు పరిష్కారం మార్గం చూపుతానని చెప్పే క్రమంలో బాధ్యతగా మాట్లాడారు పవన్ కళ్యాణ్. అయితే పవన్ కళ్యాణ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై చేసిన విమర్శలు మరిచి.. ఎంత మాత్రం తాను సీఎం పదవిలో లేనని చెప్పిన మాటను హైలెట్ చేస్తోంది. అయితే కూటమి మరో 15 సంవత్సరాల పాటు కొనసాగుతుందని పవన్ చెప్పిన మాటను ఆయన అక్షరాల పాటిస్తున్నారు. మొన్న ఆ మధ్యన ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వెళ్లి వైయస్సార్ కాంగ్రెస్ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలకు సంబంధించిన ఫోటోలు కూడా తీశారు. ఇప్పుడు గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమించే క్రమంలో.. సీఎం చంద్రబాబుతో చర్చించి పరిష్కార మార్గం చూపుతామని చెప్పారు. మొత్తానికైతే పవన్ కళ్యాణ్ చాలా బాధ్యతతో మెలుగుతున్నారు.

## తుపాన్‌గా బలపడిన సెన్యార్ తీవ్రవాయుగుండం..

,విశాఖపట్టణం, నవంబర్ 27,

నైరుతి బంగాళాఖాతం, దక్షిణ శ్రీలంక, హిందూ మహాసముద్రం మీదుగా అల్పపీడనం కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.ఇది రాబోయే 12 గంటల్లో ఉత్తర- వాయువ్య దిశగా కదులుతూ తీవ్రఅల్పపీడనంగా మారే అవకాశం ఉందంది. ఆ తదుపరి 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వివరించింది. మలక్కా జలసంధి ప్రాంతంలో సెన్యార్ తుపాన్ గా బలపడిన తీవ్రవాయుగుండం. ఈ తుపానుకు ‘సెన్యార్’గా నామకరణం చేశారు. 24 గంటల తర్వాత క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. విశాఖపట్నం, కొనసీమ, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో 5 నుంచి 10 సెం.మీ. వర్షపాతం నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. తమిళనాడులో పలు జిల్లాలకు అలర్ట్ ప్రకటించారు. మలక్కా జలసంధి ప్రాంతాల్లో తీవ్రవాయుగుండం కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ ఈరోజు తుపానుగా బలపడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని హెచ్చరించింది.అల్పపీడనం, తుపాను ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు (నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2) కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వరి కోతలు జోరుగా సాగుతున్న క్రమంలో వెంటనే కుప్పలు వేసుకోవాలని విపత్తుల నిర్వహణ శాఖ సూచించింది.

# సింగరేణి ఆధ్వర్యంలో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ పనులు మొదలు

ఖమ్మం, నవంబర్ 27,

రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయా లతో ముందుకు వెళుతుందా, వెనక్కి వెళుతుందా.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు విద్యుత్తు రంగ నిపుణుల నుంచి తీవ్ర ఆశ్చ ర్యం, అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి.నిర్ణయాలపై చర్చ మొదలైంది. రాష్ట్రంలో ఏటికేడాది పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్, అలాగే రాబోయే పదేండ్లకు ఎంత కరెం టు అవసరం, ఎంత ఉత్పత్తి అవసరమనేదానిపై క్యాబినెట్ భేటీలోచర్చించి, అధికా రులు తయారుచేసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను చూసిన తరువాత రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యు త్తు ప్లాంట్‌ను నిర్మించాలని, అలాగే పాల్వంచ, మక్తల్‌లలో థర్మల్ విద్యుత్తు కేంద్రాలను నిర్మించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలనే నిర్ణయాలపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తంఅవుతోంది.ఇప్పటికే ఉన్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల నుంచి వస్తున్న కాలుష్యం, గుట్టలకొద్దీ పోగవుతున్న బూడిదను ఏం చేయాలో తెలియక అధికారులు అల్లాడుతుండగా.. మరిన్ని థర్మల్ విద్యుత్తు కేంద్రాలను నిర్మించాలనే ఆలోచనపై విద్యుత్‌రంగ నిపుణుల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.వాస్తవానికి థర్మల్ విద్యుత్తు కన్నా.. రెన్యూవబుల్ (పునరుద్ధరణీయ) ఇంధన వనరుల ఉత్పత్తి, వినియోగం పెంచేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం అనేక రకాల పథకాలను అమలులోకి తీసుకొస్తోంది. పర్యావరణానికి విఘాతం కల్గించే థర్మల్ విద్యుత్తును మెల్లగా తగ్గిస్తూ.. సౌర, పవన, జల విద్యుత్తులపై దృష్టి సారించేలా మార్గదర్శకాలను కూడా కేంద్రం జారీచేసింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం క్యాబినెట్ సమావేశంలో ఇందుకు అనుగుణంగా.. 3,000 మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండ ర్లు పిలవాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.అలాగే కొత్తగా 2,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్‌ను కొనుగోలుకు వీలుగా టెండర్లు పిలవాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దీనితోపాటు రాష్ట్రం లో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా.. ఆసక్తిచూపే కంపెనీలను అవసరమైన భూమి, నీటిని కేటాయించాలనికూడా క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుని ప్రకటించారు. ఈ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును ముందుగా మన డిస్కంలకే అమ్మాలనే షరతుపైకూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనితోపాటు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా.. రాష్ట్రంలో కొత్తగా స్థాపించే పరిశ్రమలు వాటి అవసరాలమేరకు సొంతంగా (క్యాప్టివ్) ఉత్పత్తి చేసుకు నేందుకు వీలుగా వెంటనే అనుమతులు ఇవ్వాలనికూడా నిర్ణయం తీసుకోవడం గమనార్హం.నిజానికి ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి పీఎల్‌ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్)ను మెల్లమెల్లగా తగ్గిస్తూ వస్తున్నారు. సౌర, జల, వాయు విద్యుత్తు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఇలా థర్మల్‌ను తగ్గిస్తూ వస్తున్నారు. తెలంగాణ జోన్‌కో ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొత్తం 5580 మెగావాట్ల సామర్థ్యంతో ఉన్న థర్మల్ విద్యుత్తు కేంద్రాలున్నాయి. 2023- 24లో 79.64 శాతం పీఎల్‌ఎఫ్‌తో విద్యుత్తును ఉత్ప త్తి చేయగా.. 2024-25లో 65.01 శాతం పీఎల్‌ఎఫ్‌తో థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల లో ఉత్పత్తిని చేశారు.అదే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు (నవంబర్ 13 నాటికి) కేవలం 56.03 శాతం పీఎల్‌ఎఫ్‌తోనే థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో ఉత్పత్తి చేస్తుండటం గమనార్హం. పైగా యాదాద్రి థర్మల్‌లో మరో మూడు యూనిట్లు (2400 మెగావాట్లు) వచ్చే సంవత్సరం నాటికి పూర్తిగా అందుబాటులోకి రానుంది. దీనికితోడు ప్రైవేటు థర్మల్ ప్లాంట్ల నుంచి, అలాగే కేంద్రం నుంచి మనకు వస్తున్న థర్మల్ విద్యుతు ఉండనే ఉంది.ఇదీ కాకుం డా.. సింగరేణి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద మూడో యూనిట్ (800 మెగావాట్లు) పనులుకూడా ప్రారంభం అయ్యాయి. ఒకవంక థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్‌ఎఫ్) శాతాన్ని తగ్గిస్తూ... ఉత్పత్తిని తగ్గిస్తూనే.. మరోవంక కేంద్రం రెన్యూవబుల ఎనర్జీపై మార్గదర్శకాలను ఉటంకిస్తూ.. సౌర, వాయు, జల విద్యుత్తు ఉత్పత్తి, వినియోగంపై ఫోకస్ పెట్టామని చెబుతున్న ప్రభుత్వం.. మరోవైపు కొత్తగా థర్మల్ విద్యుత్తు కేంద్రాలను నిర్మించాలనే ఆలోచన చేయడం విద్యు త్తు రంగ నిపుణులు, రాజకీయ విశ్లేషకుల అసంతృప్తికి కారణమవుతోంది.సౌర విద్యుత్తు పగటిపూట ఉత్పత్తి అవుతుందని.. రాత్రిపూట, డిమాండ్ ఉన్నప్పుడు ఎలా అనే అనుమానాలకు పరిష్కారం చూపింది.. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం (బీఈఎస్‌ఎస్). మంగళవారమే తెలంగాణ జోన్‌కో ఆధ్వర్యంలో 750 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తును నిల్వచేసి డిమాండ్ ఉన్నప్పుడు వాడుకునేలా గ్లోబల్ టెండర్లనుకూడా పలిచింది. అలాగే సింగరేణి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా మందమర్రిలో ఒక మెగావాట్ సామర్థ్యంతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం (బీఈఎస్‌ఎస్) నిర్మాణం పూర్తయ్యింది. రెండు రోజుల్లో దీనిని ప్రారంభించనున్నారు. సింగరేణి వ్యాప్తంగా ఇలాంటి బీఈఎస్‌ఎస్ లను ఏర్పాటు చేస్తామని సింగరేణి ప్రకటించింది. అంటే ఇంతవరకు లేని విధంగా సౌలభ్యం మనకు అందుబాటులోకి వచ్చింది.ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 5,580 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తున్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల నుంచి వస్తోన్న బూడిదను ఏం చేసుకోవాలో అర్థంకాక.. అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో సుమారు 10 కోట్ల మెట్రిక్ టన్నుల బూడిద పేరుకుపోయిందని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా మరిన్ని థర్మల్ విద్యుత్తు కేంద్రాలను నిర్మించాలని క్యాబినెట్‌లో తీర్మానించడం.. పైగా అసలే బొగ్గు లేని మక్తల్ లాంటి ప్రదేశాల్లో థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై అధ్యయనం చేయాలనే క్యాబినెట్ నిర్ణయం వెనుక ఏం జరిగి ఉంటుందనే ఊహాగానాలు పుట్టుకొస్తున్నాయి.

# జగనన్న ప్రభల తీర్థానికి గుర్తింపు

కాకినాడ, నవంబర్ 27,

ఆంధ్రప్రదేశ్‌లో జరిగే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమ్మతి తెలిపారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినాల్లో.. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని నిర్వహిస్తారు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఉత్సవానికి రాష్ట్ర పండుగగా ప్రకటిస్తే.. కోనసీమ ప్రాంత ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుంది.ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలలో జగ్గన్నతోట ప్రభల తీర్థానికి ప్రత్యేక స్థానం ఉంది. వందల ఏళ్లుగా తెలుగు సంస్కృతికి చిహ్నంగా ఈ పండుగ నిలుస్తోంది. అయితే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం చంద్రబాబు సమ్మతించారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ మేరకు మలికిపురం గ్రామానికి వచ్చిన ఆయనకు స్థానికులు వినతిపత్రం అందించారు.స్థానికుల వినతిపై స్పందించిన మంత్రి దుర్గేష్.. లక్షల మంది భక్తుల కోలాహలం మధ్య ప్రతి సంవత్సరం వైభవంగా నిర్వహించే ఈ ప్రభల తీర్థానికి 450 సంవత్సరాల ఘనచరిత్ర ఉందని గుర్తుచేశారు. ఈ విషయంపై ఇప్పటికే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దీనికి సీఎం చంద్రబాబు కూడా సమ్మతి తెలిపారన్నారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ఏటా సంక్రాంతి పర్వదినాల్లో.. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని నిర్వహిస్తారు. పంట కాలువల సవ్వడి నడుమ సంక్రాంతి కనుమ రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. దాదాపు 450 ఏళ్లు చరిత్ర కలిగిన ఈ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని ప్రజలు ఎప్పటినుంచో ఆకాంక్షిస్తున్నారు. దేశం మొత్తంలో.. ఏకాదశరుద్రులు ఒకేచోట కొలువుతీరేది జగ్గన్నతోట ప్రభల ఉత్సవంలోనే. రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన ప్రభలు అంబాజీపేట మండలంలోనే తయారు చేస్తారు.ఈ జగ్గన్నతోట ప్రభల ఉత్సవం విశిష్టత గురించి గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు రాసిన లేఖల ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ తెలుసుకున్నారు. అనంతరం ప్రధాని 2020లో తన సందేశాన్ని పంపించారు. 2023లో ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకలో జగ్గన్నతోట ప్రభల తీర్థం శకటాన్ని ప్రదర్శించారు. ఈ ప్రభల గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించడం విశేషం. ఈ ఏడాది పర్యాటకశాఖ ఈవెంట్స్-ఫెస్టివల్ వెబ్‌సైట్‌లో ఈ ఉత్సవం చోటు దక్కించుకోవడం గమనార్హం. అంతేకాకుండా పదోతరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో.. జగ్గన్నతోట ప్రభల తీర్థం ప్రాధాన్యత, ప్రాచుర్యాన్ని వివరించారు.జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్రపండుగగా గుర్తిస్తే.. కోనసీమ ప్రాంతం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు దక్కుతుంది. పర్యాటకులు కూడా ఎక్కువ సంఖ్యలో రావడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఇక రాష్ట్ర పండుగగా గుర్తిస్తే.. ఈ ఉత్సవం మరింత వైభవంగా జరపడానికి.. ఉత్సవానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. అంతేకాకుండా పదకొండు గ్రామాల్లో కొలువుదీరిన ఏకాదశ రుద్రుల ఆలయాలు మరింత అభివృద్ధి చెందుతాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు.. ఆలయాల వద్ద ప్రధానంగా తాగునీరు, వైద్యశిబిరాలు, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయొచ్చు.

# పదో తరగతి పరీక్షలకు వంద రోజుల ప్లాన్

విజయవాడ, నవంబర్ 27, (న్యూస్ పల్స్)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఇంటర్మీడియట్ బోర్డు 'సంకల్ప్-2026' కార్యక్రమాన్ని చేపట్టింది. 50 రోజుల ప్రణాళికతో కూడిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్ బాషా విడుదల చేశారు. నవంబరు 24 నుంచి ఫిబ్రవరి 20 వరకు ఈ ప్రణాళిక అమలు చేయనున్నారు. సంకల్ప్ ప్రణాళిక ప్రకారం.. రోజూ ఉదయం 9.10 నుంచి 12.40 గంటల వరకు అన్ని సబ్జెక్టుల్లో బోధించని అంశాలను పూర్తి చేయాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రివిజన్, ఇతర టెస్ట్‌లు విద్యార్థులకు నిర్వహించాలి. డిసెంబరు 15 నుంచి 20 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత డిసెంబరు 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు స్పెషల్ క్లాసులు ఉంటాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జూనియర్ కాలేజీల్లో ఈ ప్రణాళికను అమలు చేయాలని ఇంటర్ బోర్డు సూచించింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026 మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు విద్యాశాఖ ఇటీవల షెడ్యూలు కూడా విడుదల చేసింది. షెడ్యూలు ప్రకారం పరీక్షలకు వంద రోజులు సమయం ఉంది. ఇప్పటికే పరీక్ష కేంద్రాల ఎంపిక, అక్కడ ఉన్న వసతులపై విద్యాశాఖాధికారులు పరిశీలన చేశారు. అవసరమైన చోట వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈసారి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నారు. దీంతో విద్యాశాఖ అధికారులు గతంలో కన్నా ఈ ఏడాది నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు రూపొందించింది.ప్రతీరోజు తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేచి చదువుకోవాలి. ఏ సబ్జెక్టు అయినా రెండు లేదా మూడు భాగాలుగా విభజించుకోవాలి. పరీక్ష గడువు కాలాన్ని బట్టి కొంత సమయం రివిజన్‌కు కేటాయించి, మిగిలిన వాటిని పాఠ్యాంశాలు చదవడానికి కేటాయించాలి. రోజూ 20 నిమిషాల పాటు ధ్యానం చేయాలి. గత పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు చదివి సాధన చేయాలి. చదివిన ప్రశ్నలను చూడకుండా రాయాలి. వేగంగా రాసే విధానం అలవాటు చేసుకోవాలి. బిట్‌పేపరుపై నిర్లక్ష్యం వదిలి క్షుణ్ణంగా చదవాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులతో చర్చిస్తూ అనుమానాలు నివృత్తి చేసుకోవాలి.. ఈ మేరకు కార్యచరణతో వంద రోజుల ప్రణాళికను అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని అధికారులు సూచించారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు.

# విల్లాల కల్చర్

హైదరాబాద్, నవంబర్ 27,

హైదరాబాద్ మహానగరం నలువైపులా విస్తరిస్తోంది. భారీ భవన నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్స్‌లో హైరైజ్ బిల్డింగ్స్ సంఖ్య విపరీతంగా పెరిగింది. కోకాపేట, నానక్ రాంగూడ, నార్సింగి, గచ్చిబౌలి ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా పెరిగాయి. రాయదుర్గంలో ఎకరా 177 కోట్ల రూపాయలు పలికింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలకు కూత వేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతమంతా అద్దాల మేడలతో రంగుల ప్రపంచంగా మారిపోయింది. విద్యుత్ కాంతులతో మెరిసిపోతుంది. కాస్ట్‌లీ ఏరియాలో లగ్జరీ అపార్ట్‌మెంట్స్‌కు భారీగా డిమాండ్ ఉంది. టెకీలు.. తమ కార్యాలయాలకు దగ్గరలో ఉండే విధంగా ఇళ్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు పక్కనే ఉండటం, ఆఫీస్‌కు దగ్గరలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. లగ్జరీ అపార్ట్‌మెంట్స్‌కు క్రేజ్ పెరిగిందని.. దీంతో వీటి అమ్మకాల సంఖ్య పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.మరోవైపు విల్లాల కల్చర్ కూడా పెరిగిపోయింది. విల్లా అనేది స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అయితే పది కోట్ల రూపాయల వరకు వెచ్చించి విల్లాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కనెక్టివిటీ ఉంటే చాలు ఎంత దూరమైన వెళ్లి విల్లా కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. కాలుష్య భూతానికి దూరంగా విల్లాల్లో విలాసవంతంగా జీవించేందుకు హైదరాబాదీలు మక్కువ చూపిస్తున్నారు. ఆఫీస్‌లకు దగ్గరగా ఉండాలని కోరుకునేవారు తప్పనిసరి పరిస్థితుల్లో లగ్జరీ అపార్ట్‌మెంట్స్ చూస్తున్నారు. శంషాబాద్, కిస్మత్‌పూర్, కొంపల్లి ప్రాంతాల్లో విల్లాల నిర్మాణాలు పెరిగిపోయాయి. డిమాండ్ మేరకే నిర్మాణాలు కొనసాగుతున్నాయని రియాల్టర్లు చెబుతున్నారు.

# పార్లమెంటుకు అమరావతి బిల్లు...



విజయవాడ, నవంబర్ 27,

అమరావతి రైతుల చిరకాల వాంఛ తీరనుంది. ఏపీ ప్రజల్లో ఉన్న అయోమయం తొలగనుంది. ఏపీకి అమరావతి శాశ్వత రాజధానిగా కేంద్రం గుర్తించనుంది. ఈ మేరకు డిసెంబర్ లో పార్లమెంటులో అమరావతి రాజధానిగా చట్టం చేయనున్నారు. చట్టబద్ధత కల్పించనున్నారు. గత అనుభవాల దృష్ట్యా భవిష్యత్తులో మరోసారి అటువంటి పరిస్థితులు తలెత్తకుండా చట్టబద్ధత కల్పించాలన్నది చాలా ఏళ్లుగా వినిపిస్తూ వస్తోంది. ఇప్పుడు ఏపీలో టిడిపి కూటమి ప్రభుత్వం ఉండడం.. ఆపై కేంద్రంలో కీలక భాగస్వామి కావడంతో అమరావతికి చట్టబద్ధత అనేది సులువు అవుతోంది. దేశంలో ఏ రాష్ట్ర రాజధాని కీ లేని అరుదైన గౌరవం, ఆపై ఏకంగా చట్ట 'భద్రత' దొరకనుంది.నవ్యాంధ్రప్రదేశ్ కు టిడిపి తొలి ప్రభుత్వం పగ్గాలు చేపట్టింది. అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది. అయితే అటు తరువాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కారణాలతో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఆ సమయంలో మంత్రి బొత్స లాంటి సీనియర్ నేత కూడా అమరావతికి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదని.. అందుకే అమరావతిని మారుస్తున్నట్లు ప్రకటన చేశారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం సైతం ఈ విషయంలో కలుగజేసుకోలేదు. రాష్ట్రాల రాజధానుల ఏర్పాటు అనేది ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని.. అందులో కలుగజేసుకోలేమని ప్రకటించింది. టిడిపి తో బిజెపికి ఉన్న విభేదాలతోనే అలా ప్రకటన చేసిందని అంతా భావించారు. అయితే చాలా సందర్భాల్లో అమరావతిని రాజధానిగా కేంద్రం గుర్తించిందన్న ప్రకటన వచ్చేది అప్పట్లో. అంతకుమించి స్వాంతన ఉండేది కాదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి రాజధాని నిర్మాణ పనులు పున ప్రారంభం అయ్యాయి. కానీ అమరావతి పై అనుమానపు ఛాయలు అలానే ఉండిపోయాయి. జగన్ లాంటి మరో నేత వచ్చి అమరావతి కాదని వేరే రాజధాని ప్రకటిస్తారన్న అనుమానాలు కూడా ఉండిపోయాయి ప్రజల్లో. అందుకే ప్రజల్లో ఉన్న అయోమయాన్ని పోగొట్టాలని సిఆర్డిఏ అధికారులు కేంద్రాన్ని ఆశ్రయించారు. అమరావతి రాజధాని కి చట్టబద్ధత కల్పిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని.. పార్లమెంటులో చర్చించి ఆమోదించాలని అటార్నీ జనరల్ వెంకటరమణను కోరారు. అయితే దేశంలో ఏ రాజధానికి కూడా గెజిట్ నోటిఫికేషన్ అనేది ఇవ్వలేదని.. అలా ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం లేదని.. అది రాష్ట్ర ప్రభుత్వ అభిమతంపై ఆధారపడి ఉంటుందని చెప్పుకొచ్చారు.ప్రస్తుతం ఎన్డీఏలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. అమరావతి విషయంలో చట్టబద్ధత కల్పించకపోతే వచ్చే ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లింది. ప్రజల్లో ఉన్న అయోమయం తొలగించడంతో పాటు భారీగా పెట్టుబడులు వస్తున్న దృష్ట్యా ఇన్వెస్టర్స్ లో నమ్మకం కోసమైనా అమరావతికి చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందని ఏపీ నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. దీనిపై అటార్నీ జనరల్ సైతం సంతృప్తి వ్యక్తం చేస్తూ ఒక నోటు తయారు చేసి.. కేంద్ర క్యాబినెట్ కు పంపించారు. అక్కడ ఆమోదముద్ర వేసి న్యాయ శాఖకు వెళ్ళింది ఆ నోటు. అక్కడ కూడా అనేక రకాల అభ్యంతరాలు అధిగమించి ప్రస్తుతం హోం శాఖ పరిధిలో ఉంది. డిసెంబర్ లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అమరావతి బిల్లు చర్చకు రానుంది. తప్పనిసరిగా చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. నిజంగా ఇది అమరావతికి శుభపరిణామమే.

# చేతికొస్తున్నపంటలకు దక్కని మద్దతు ధరలు

తిరుపతి, నవంబర్ 27,

ఆంధ్రప్రదేశ్‌లో రైతులు పంట చేతికి వచ్చిన ప్రతీ సారి ఇబ్బంది పడుతున్నారు. మొదట తోతాపురి మామిడి కాయలకు డిమాండ్ లేక ఆందోళన చెందారు. తర్వాత ఉల్లి పంట పరిస్థితి అదే. ఇప్పుడు అరటి పంటలకూ డిమాండ్ ఉండటం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో తోతాపురి మామిడి రైతులు ధరలు పడిపోవడంతో రూ.1,000 కోట్ల నష్టం చవిచూశారు. సెప్టెంబర్‌లో ఉల్లి ధరలు పడిపోయి, కర్నూల్, కడప జిల్లాల్లో రైతులు పంటను పారబోశారు. ఇప్పుడు అరటి పంటలకూ అదే పరిస్థితి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 18 ముఖ్య ఆహార పంటల్లో మామిడి, ఉల్లి, అరటి ప్రధానమైనవి. 2024-25లో మామిడి పంటలు అధిక ఉత్పత్తి ధర తగ్గుబాటు కారణంగా రైతులు భారీ నష్టం చవిచూశారు. ప్రభుత్వం కొంత సాయం చేసింది. సెప్టెంబర్‌లో ఉల్లి రైతులకు అదే సమస్య వచ్చింది.ఇప్పుడు అరటి రైతులు గగ్గోలు పెడుతున్నారు. డిమాండ్ , ఎగుమతులు తగ్గడం, లోకల్ మార్కెట్ స్థిరత్వం లేకపోవడం వల్ల ధర పడిపోయాయి. 2025లో ఆంధ్రలో హార్టికల్చర్ పంటలు 30 శాతం పెరిగింది. కానీ మద్దతు ధర విధానం సరిగ్గా లేకపోవడం వల్ల రైతులు లాభాలు పొందలేకపోతున్నారు. ఫలితంగా, రైతుల ఆదాయం 40 శాతం తగ్గిందని చెబుతున్నారు. సెప్టెంబర్ 2025లో ధరల పతనంతో రూ.50,000/ హెక్టారుకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. - 24,000 మంది రైతులు ప్రయోజనం పొందారు. నవంబర్ 2025లో మార్కెట్ ధరలు మెరుగుపడ్డాయి. జూలై 2025లో కేంద్రం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ఆమోదించి తోతాపురి రైతులకు రూ.1,490 క్వింటాల్ మద్దతు ధర నిర్ణయించింది. రాష్ట్రం రూ.4 కేజీ సబ్సిడీ మొత్తం రూ.260 కోట్లు ఇచ్చింది. అక్టోబర్ 2025లో రూ.172.84 కోట్లు 37,881 మంది రైతుల అకౌంట్లలో జమ చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రైతులు ప్రధానంగా ప్రయోజనం పొందారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రైతు పథకాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించడం వంటి చర్యలు ప్రకటించింది. అరటి పంటలకు ఊఖ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. కానీ, ఇదంతా పేపర్ల మీదనే ఉన్నాయని రైతుల వరకూ వెళ్లడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతుంది. ఇన్‌పుట్ సబ్సిడీలు, కోల్డ్ స్టోరేజ్ సమస్యలు ఉండటంతో రైతులు మధ్యవర్తుల చేతిలో మోసపోతున్నారు. 2025లో హార్టికల్చర్ పంటలకు 1500 కోట్లు బడ్జెట్ కేటాయించినప్పటికీ, గ్రౌండ్ లెవల్‌లో అమలు జరగడం లేదు. పంటలు అనూహ్యంగా ఎక్కువగా పండటం వల్ల ఇతర చోట్ల డిమాండ్ తగ్గిపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయి. ప్రభుత్వం ఎంత సాయం చేసినా రైతులు మాత్రం నష్టపోతూనే ఉన్నారు.

# విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే వైజ్ఞానిక ప్రదర్శనల గురించి ప్రోత్సాహం అందించాలి

## -కరీంనగర్ జిల్లా విద్యాధికారి శ్రీరాం మొడయ్య

## -అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నవంబర్ 29 నుండి జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన

కరీంనగర్, నవంబర్ 27(భారతశక్తి ప్రతినిధి):

విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే పలు వైజ్ఞానిక ప్రదర్శనల గురించి ప్రోత్సాహం అందించాలని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయటానికి పలు ప్రదర్శనలు వేదికగా మలుచుకోవాలని తద్వారా వారు రూపొందించిన నమూనాలు ప్రదర్శించవచ్చని కరీంనగర్ జిల్లా విద్యాధికారి శ్రీరాం మొడయ్య అన్నారు. గురువారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించినటువంటి వైజ్ఞానిక ప్రదర్శన సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిలుగా కరీంనగర్ జిల్లా విద్యాధికారి శ్రీరాం మొడయ్య,అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి , జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి లు ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా విద్యాధికారి శ్రీరాం మొడయ్య మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా సృజనాత్మకతకు మారుపేరని, విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టేటువంటి గొప్ప జిల్లా అని అన్నారు.ప్రతి సంవత్సరం కరీంనగర్ జిల్లా నుండి జపాన్ వెళ్లడానికి ఎంపిక



అవుతున్నారని హర్షం వ్యక్తం చేస్తూ ఈ సంవత్సరం కూడా జిల్లా కలెక్టర్ పమేల సత్పతి మార్గదర్శకమున జిల్లా స్థాయి బాల వైజ్ఞానికప్రదర్శన 2025 -26 సంవత్సరానికి మరియు జిల్లా స్థాయి ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శన 2024 25 సంవత్సరానికి ఘనంగా నిర్వహించడానికి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలను వేదికగా ఎంపిక చేసామని తెలిపారు. అన్ని వసతులతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరం కూడా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రదర్శనకు మొత్తం 717 నమూనాలు నమోదు చేయడం జరిగిందని, ఇందులో నుండి 7 జూనియర్, 7 సీనియర్ రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శనకు 126 నమూనాలు నమోదు చేయబడినయని ఇందులో నుండి 13 నమూనాలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.ప్రదర్శనకు వివిధ పాఠశాలల యజమాన్యాలు , ఉపాధ్యాయులు అందరు కూడా సహకరించి చక్కటి సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్నటువంటి ప్రతి వేడుక విజయవంతంగా జరిగాయని ఈ ప్రదర్శన కూడా చాలా గొప్పగా జయప్రదం కావాలని ఆకాంక్షించారు. అనంతరం అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చాలా చక్కటి అవకాశం విశ్వాసంతో విద్యాసంస్థలకు ఇచ్చినందుకు జిల్లా పరిపాలనిధికారి పమేలా సత్పతి కి ధన్యవాదాలు తెలియజేశారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల పక్షాన పాఠశాలను వేదికగా ఇవ్వడం జరిగిందని, ఈ వేదికగా విద్యార్థులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి యొక్క ప్రతిభను చాటాలని సూచించారు. విద్యార్థులకు అన్ని విధాలుగా విద్యాసంస్థల తరపున చేయుత అందిస్తామని వారికి ఎటువంటి లోటు రాకుండా చక్కటి ప్రదర్శనకు గొప్ప వేదిక అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మెయిన్ థీమ్:అభివృద్ధి చెందిన భారతదేశం మరియు స్వయం సమృద్ధి భారతదేశం..సబ్ థీమ్స్:1. సుస్థిర వ్యవసాయం 2.వ్యర్థ పదార్థాల నిర్వహణ మరియు ప్రత్యామ్నాయ మొక్కలు,3.హరిత శక్తి , 4. అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, 5. వినోదపరితమైన గణిత నమోనాలు, 6. ఆరోగ్యం మరియు పరిశుభ్రత, 7. నీటి సంరక్షణ మరియు నిర్వహణ నవంబర్ 29 డిసెంబరు ఒకటి వరకు ఈ మూడు రోజుల ప్రదర్శనకు జిల్లా కలెక్టర్ చైర్ పర్సన్ గా, జిల్లా విద్యాధికారి కన్వీనర్ గా, జిల్లా సైన్స్ అధికారి కో కన్వీనర్ గా వ్యవహరిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కట్ట ఆనందం, డిసీఇబీ కార్యదర్శి భగవంత రావు, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ సమన్వయకర్త అనంత చార్య , మిల్కూరి శ్రీనివాస్ ,జిల్లా ప్రణాళిక సమన్వయకర్త, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్ లో డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్ నవంబర్ 27

మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు రూ.25 వేల విలువైన 13 గ్రాముల ఎండిఎంయే తో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు, గోవాల నుంచి డ్రగ్స్ తీసుకొస్తున్నారని, గతంలో కూడా వీరిపై కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 27: మాచారెడ్డి మండలం, సోమవారం పేట్ గ్రామ పంచాయితీ పరిధి లోని నెమలి గుట్ట తాండాలో వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రంలో వరి స్వీకరణ విధానం, తూకాల యంత్రాలు, నిల్వ సౌకర్యాలు, రైతులకు అందిస్తున్న సేవలు, బిల్లుల జారీ , లోడింగ్ వంటి అంశాలను సమీక్షించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

రైతుల సమస్యలను కలెక్టర్ నేరుగా తెలుసుకొని, వెంటనే పరిష్కారం కోసం సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరి కొనుగోలు కేంద్రాల పనితీరుపై నిరంతరంగా పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్, సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, డీఎమ్ శ్రీకాంత్, తహసిల్దార్ సరళ, ఎంపీడీవో శ్రీనివాస్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నామినేషన్ల స్వీకరణ సజావుగా జరిగేలా చూడాలి: కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 27:



జిల్లాలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నిర్వహించబోతున్న నామినేషన్ స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా రిటర్నింగ్ అధికారులు చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.

గురువారం నూతనకల్ మండల కేంద్రంలోని ఎం ఆర్ సి భవనం, మిర్యాల , ఆత్మకూర్ ఎస్ మండలం ఏపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలలో మొదటి విడత గ్రామ పంచాయతీ సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎస్పి కే నరసింహ తో కలిసి ఆయన పరిశీలించారు.నూతనకల్ ఎం ఆర్ సి భవనంలో నూతనకల్, వెంకేపల్లి, యెడవల్లి, చిల్ప కుంట్ల గ్రామపంచాయతీ సర్పంచులకు, వార్డు సభ్యులకు నామినేషన్ సేకరించడం జరుగుతుందని అలాగే మిర్యాల గ్రామపంచాయతీ కార్యాలయంలో మిర్యాల, అల్లునూరు, లింగంపల్లి,మాచనపల్లి గ్రామపంచాయతీ సర్పంచులకు వార్డు మెంబర్లకు, ఏపూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏపూరు, ఏపూరు తండా, బొప్పారం,కాశిగూడెం, మక్త కొత్తగూడెం, రామన్నగూడెం, మిడ్తనపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు, వార్డు సభ్యులకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

నామినేషన్ స్వీకరణ కేంద్రంలోకి అభ్యర్థి తో పాటు మరో ఇద్దరినీ మాత్రమే అనుమతించాలని అలాగే వాహనాలు 100 మీటర్ల దూరంలోనే ఆపేయాలని ఆదేశించారు.అభ్యర్థులకు నామినేషన్ ప్రక్రియ లో ఎలాంటి సందేహాలు ఉన్న హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోవాలని, ఏలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు.గ్రామాల వారీగా స్వీకరించిన నామినేషన్ పత్రాలను వేరు వేరుగా భద్రపరచాలని సూచించారు.కలెక్టర్ వెంట డి ఎస్ పి ప్రసన్న కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ లు సునీత, మహ్మద్ హసీం,ఆర్ ఓ లు,అధికారులు తదితరులు ఉన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి:జిల్లా ఎన్నికల పరిశీలకులు అయేషా మస్రత్ ఖానం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 27 (భారత శక్తి): గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అధికారులను ఆదేశించారు.

గురువారం లక్ష్మణచందా మండలంలోని వడ్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పంచాయితీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలకులు, కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన



వసతులను పరిశీలించారు. పరిశీలకు మాట్లాడుతూ, హెల్ప్ డెస్క్ లో సిబ్బంది అందుబాటులో ఉంటూ, అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు. అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు.

కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకముల ఫారములను తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని వివరించారు. ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గుడిపాటి నర్సయ్యను సన్మానించిన- కందుకూరి లక్ష్మయ్య



సూర్యాపేట (భారత్ శక్తి జిల్లా ప్రతినిధి), నవంబర్ 27: ఇటీవల కాంగ్రెస్ పార్టీ సూర్యాపేటజిల్లా అధ్యక్షుడు గా బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడిపాటి నర్సయ్యను, కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ప్రెస్ కన్వీనర్ కందుకూరి లక్ష్మయ్య శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత జాతి బిడ్డ గుడిపాటి నరసయ్య పార్టీ కి చేసిన సేవలను గుర్తించి సూర్యాపేట జిల్లా అధ్యక్ష బాధ్యతను అప్పగించినందుకు హరిజన గిరిజన బడుగు బలహీన వర్గాల నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసిఅధ్యక్షుడు మహేష్ గౌడ్ జిల్లా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వెంకట్ రెడ్డి తుంగతుర్తి శాసనలు సభ్యులు మందుల సామెల్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నరసయ్య ఇంకా భవిష్యత్తులో పార్టీలో ఎన్నో ఉన్నతమైన బాధ్యతలు చేపట్టాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుపాన్ యూనియన్ అధ్యక్షుడు కందుకూరి శ్రీనివాస్, ట్రాన్స్పోర్ట్ యూనియన్ అధ్యక్షుడు సోమవారపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ముంబైలో పాతళలోకం

## ట్రాఫిక్ కష్టాలు ఇంతింతకాదయా...

ముంబై, నవంబర్ 27

ముంబై ట్రాఫిక్ కష్టాలు తీర్చే ప్రణాళికలను మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడించారు. ముంబైలో భూగర్భంలో సొరంగ మార్గాల నెట్‌వర్క్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టన్నెల్స్ నిర్మాణాన్ని పాతాళ లోకంగా సీఎం ఫడ్నవీస్ అభివర్ణించారు. భూమిపై ఉన్న రోడ్లకు సమాంతరంగా ఈ టన్నెల్స్ ఉంటాయని తెలిపారు. అటల్ సేతు నుంచి బాంద్రా-వర్లీ సీ లింక్ వరకు.. బాంద్రా నుంచి బీకేసీ వరకు కొత్త మార్గాలు రానున్నాయిదేశ ఆర్థిక రాజధాని ముంబైలో ట్రాఫిక్ సమస్య గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే.. ముంబై ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తాము రచిస్తున్న భారీ ప్రణాళికను వివరిస్తూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ముంబై అడుగున తాము ఒక పాతాళ లోకాన్ని సృష్టిస్తున్నామని పేర్కొన్నారు. ప్రముఖ వెబ్ సిరీస్ పేరును ఉపయోగించి దేవేంద్ర ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముంబైలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి భూమి పైన ఉన్న రోడ్లకు సమాంతరంగా.. భూమి లోపల భారీ సొరంగ మార్గాలను నిర్మించి.. నెట్‌వర్క్ విస్తరించనున్నట్లు తెలిపారు. ముంబై అంతటా సొరంగాల విస్తృతమైన నెట్‌వర్క్‌ను సృష్టిస్తున్నామని.. ఇది ఒక రకంగా పాతాళ లోకం లాంటిదని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల ముంబైలో ట్రాఫిక్ రద్దీని పూర్తిగా తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ టన్నెల్ నెట్‌వర్క్‌కు మెట్రో కారిడార్లు అనుబంధంగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

ముంబైలో కీలక ప్రాజెక్టులు

బోరివలి - గోరేగావ్: ప్రస్తుతం ఉన్న రోడ్లకు సమాంతరంగా బోరివలి - గోరేగావ్ మార్గంలో కొత్త రహదారి.


వర్లీ - శివడి కనెక్టర్: వచ్చే ఏడాది అందుబాటులోకి రానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా అటల్ సేతు నుంచి బాంద్రా-వర్లీ సీ లింక్ వరకు నాన్‌స్టాప్ ప్రయాణం.

బాంద్రా - బీకేసీ టన్నెల్: బాంద్రా నుంచి బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) వరకు ప్రతిపాదించిన సొరంగం ద్వారా ఎయిర్‌పోర్ట్ ప్రయాణం సులభం కానుంది.త్వరలో జరగనున్న బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికల నేపథ్యంలో దేవేంద్ర ఫడ్నవీస్ రాజకీయ వ్యూహాలపైనా స్పందించారు. ప్రజాస్వామ్యాన్ని నడపడానికి రెండు మార్గాలు ఉన్నాయని.. అందులో ఒకటి సిద్ధాంతమని.. రెండోది సంఖ్యాబలం అని పేర్కొన్నారు. సంఖ్యాబలం లేకుండా సిద్ధాంతాన్ని ప్రచారం చేయలేమమని.. రాజకీయాల్లో ప్రాక్టికల్‌గా ఉండాలని హితవు పలికారు. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ స్థాపించిన జన్ సురాజ్ పార్టీ ఘోర వైఫల్యాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రశాంత్ కిషోర్ సిద్ధాంతం గురించి మాట్లాడారని.. కానీ ఆయనకు సీట్లు రాలేదని దేవేంద్ర ఫడ్నవీస్ గుర్తు చేశారు.రాజకీయ వ్యవస్థ మొత్తం అవినీతిమయం అయిందని ముద్ర వేయడాన్ని తాను అంగీకరించనని సీఎం ఫడ్నవీస్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని.. కానీ రాష్ట్ర స్థాయిల్లో కొన్ని సంఘటనలు జరుగుతున్నాయని అంగీకరించారు. అంత మాత్రాన వ్యవస్థ మొత్తం చెడ్డది అని కాదని పేర్కొన్నారు. వేర్వేరు సిద్ధాంతాలు ఉన్నప్పటికీ, ఉమ్మడి ప్రణాళిక ద్వారా ప్రభుత్వాన్ని నడపవచ్చని తెలిపారు

=========

# ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 27 ( భారత శక్తి) :గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాకు పరిశీలకులుగా నియమించబడి, జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయేషా మస్రత్ ఖాన్ ను, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఉదయం అటవీ శాఖ అతిథి గృహంలో



మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్, అబ్జర్వర్ కు పూల మొక్కను అందించారు. అనంతరం ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై ఇరువురు చర్చించారు.

పరిశీలకులను కలిసిన వారిలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# ఈ కారు నెంబరే కోటి 17 లక్షలు

ఛండీఘడ్, నవంబర్ 27,

మన దగ్గర చాలా మందికి కార్లు, బైకులు అంటే ఇష్టం. కానీ కొందరికి మాత్రం ఫ్యాన్సీ నంబర్ల పిచ్చి ఉంటుంది. దీని కోసం లక్షలు, కోట్లు ఖర్చు చేస్తారు. తాజాగా హర్యానాలో ఊఖీ88ః8888 అనే నంబర్ రూ. 1.17 కోట్లకు అమ్ముడై.. దేశంలోనే అత్యంత ఖరీదైన ఫ్యాన్సీ వాహన నంబర్‌గా నిలిచింది. విశేషం ఏంటంటే.. ఈ నంబర్‌ను దక్కించుకున్న వ్యక్తి ఇంకా కారు కొనలేదంట. ఈ వార్త తెలిసిన ప్రతి ఒక్కరు ఆశ్చర్యపోతున్నారు. ఆ వివరాలు..మనిషికో రకం అభిరుచి ఉంటుంది. కొందరికి హైఎండ్ కార్లు, బైకులు, గాడ్జెట్స్ అంటే ఇష్టం ఉంటుంది. కొందరికి పాత కాలం నాటి వాహనాలు, వస్తువులు అంటే మక్కువ. అలానే కొందరికి ఫ్యాన్సీ నంబర్ల పిచ్చి ఉంటుంది. ఎంతలా అంటే.. వాహనం కన్నా ఎక్కువ ధరను దాని నంబర్‌కే పెడతారు. లక్షల రూపాయలు చెల్లించి మరి ఫ్యాన్సీ నంబర్లను సొంతం చేసుకుంటారు. అయితే ఇప్పటి వరకు ఇలా ఫ్యాన్సీ నంబర్ల కోసం.. వాహనం కన్నా ఎక్కువ ఖరీదు, లక్షలు ఖర్చు చేసిన వారి గురించి విన్నాం. ఇప్పుడు అంతకు మించి అనే వార్త వెలుగులోకి వచ్చింది. దేశంలోనే అత్యంత ఖరీదైన ఫ్యాన్సీ నంబర్‌గా నిలిచింది ఊఖీ88ః8888. దీని కోసం కోటి రూపాయలకు పైగా ఖర్చు చేశాడో వ్యాపారవేత్త. ఆ వివరాలు..దేశంలోనే అత్యంత ఖరీదైన ఫ్యాన్సీ నంబర్ రికార్డు హర్యానాలో నమోదైంది. రాష్ట్రంలో తాజాగా నిర్వహించిన వీఐపీ నంబర్ ప్లేట్‌ల ఆన్‌లైన్ వేలంలో 'ఊఖీ88ః8888' అనే ఫ్యాన్సీ నంబర్ రూ. 1.17 కోట్ల భారీ మొత్తానికి అమ్ముడుబోయింది. బుధవారం నాడు ఈ వేలం పాట నిర్వహించగా.. 45 మంది బిడ్డర్లు పోటీలో పాల్గొన్నారు. రూ. 50,000 బేస్ ప్రైస్‌తో ప్రారంభమైన వేలం.. సాయంత్రానికి రూ. 1.17 కోట్ల వద్ద వేలం ముగిసింది.భివానీ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ఇంత ఖర్చు చేసి మరీ ఈ ఫ్యాన్సీ నంబర్‌ను దక్కించుకున్నాడని తెలుస్తోంది. అతడికి ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్‌తో పాటు సాఫ్ట్‌వేర్ కంపెనీ కూడా ఉందని సమాచారం. అయితే ఇక్కడ అత్యంత ఆశ్చర్యకరమైన అంశం ఏంటంటే.. సదరు



వ్యాపారవేత్త ఇంకా కారు కొనలేదంట. కానీ దాని కోసం కోట్లు ఖర్చు చేసి మరీ నంబర్ ప్లేట్ కొనడం విశేషం.హర్యానా ప్రభుత్వం ప్రతి వారం వీఐపీ, ఫ్యాన్సీ నంబర్లకు ఆన్‌లైన్ వేలం నిర్వహిస్తుంది. ప్రతి వారంలో.. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఇది సోమవారం ఉదయం 9 గంటల వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత బుధవారం 5 గంటలకు వేలం ఫలితాలు వెల్లడిస్తారు. ఇక గత వారం 'ఊఖీ22చి2222' నంబర్‌ను రూ37. 91 లక్షలకు కొనుగోలు చేశారు. ఇక ఇప్పుడు 'ఊఖీ88ః8888' నంబర్‌ను ఏకంగా కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసి దక్కించుకున్నారు.అయితే ఈ నంబర్ ప్రత్యేకత ఏమిటంటే.. పెద్ద అక్షరం 'ః' కూడా '8'ను పోలి ఉంటుంది. అలాగే నంబర్‌లో వరుసగా ఉన్న ఎనిమిదులు రావడం శుభప్రదం మాత్రమే కాక ప్రీమియం లుక్‌ను కూడా అందించాయి. ఏది ఏమైనా.. 'ఊఖీ88ః8888' నంబర్ ప్లేట్ రూ. 1.17 కోట్ల ధరకు అమ్ముడవడం చూస్తే.. దేశంలో ఫ్యాన్సీ నంబర్లు, విఐపి నంబర్లకు పెరుగుతున్న క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది అంటున్నారు.

===================

# రంగంలోకి దళపతి...

హైదరాబాద్, నవంబర్ 27,

స్థానిక సమరం తెలంగాణ పొలిటికల్ పిచ్‌ను హీటెక్కిస్తోంది. గ్రామాల్లో పార్టీకి పునాదిగా ఉండే లోకల్ బాడీ పోల్స్‌పై రాజకీయ పార్టీలన్నీ సీరియస్ కాన్సన్‌ట్రేషన్ చేశాయి. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంటుంది. బీసీ రిజర్వేషన్లపై అధికార కాంగ్రెస్‌ను ఎండగడుతూనే సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలుచుకోవాలన్న లక్ష్యంతో ముందుకెళ్తోంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్..మాట తప్పి పార్టీపరంగా రిజర్వేషన్లు అంటూ బీసీలకు అన్యాయం చేస్తోందని ప్రజల్లోకి తీసుకెళ్లాలని డిసైడ్ అయ్యింది గులాబీ పార్టీ. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు సహా ఇతర హామీల వైఫల్యాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది. పరంగా పంచాయతీ ఎలక్షన్స్ ప్లాన్స్ అలా ఉంటే..గులాబీ బాస్ కేసీఆర్..సర్పంచ్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సర్పంచ్‌లు రోల్ కీలకంగా మారనున్న నేపథ్యలో..సాధ్యమైనంత వరకు బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని భావిస్తున్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్వయంగా అధినేత కేసీఆర్ రంగంరోకి దిగబోతున్నారని తెలుస్తోంది.అనారోగ్యంతో పాటు వివిధ కారణాలతో గత రెండేళ్లుగా కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లోనే గడుపుతున్నారు. ఒకట్రెండు సార్లు తెలంగాణ భవన్‌కు, చికిత్స కోసం హైదరాబాద్ వచ్చినప్పుడు కొన్ని రోజులు నందినగర్ నివాసంలో ఉన్నారు కేసీఆర్. పార్టీకి సంబంధించి ముఖ్య సమావేశాలు నిర్వహించాల్సి వచ్చినా, నేతలను కలవాల్సి వచ్చినా ఫామ్ హౌజ్‌కే పిలిపించుకుంటున్నారు కేసీఆర్. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ముఖ్య నేతలంతా కేసీఆర్‌ను కలవాలంటే ఎర్రవల్లికి వెళ్తున్నారుస్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గులాబీ బాస్ కేసీఆర్ నేతలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. డిసెంబర్ మొదటి వారంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి హైదరాబాద్‌లోని నందినగర్ నివాసానికి రానున్నారని అంటున్నారు. సర్పంచ్




ఎన్నికలు ముగిసే వరకు నందినగర్ నివాసంలోనే ఉంటూ..తెలంగాణ భవన్‌కు వచ్చి వెళ్తారని సమాచారం.జిల్లాల నుంచి కేసీఆర్‌ను కలిసేందుకు వచ్చే వారికి ప్రత్యేకంగా సమయం కేటాయించి సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి కేసీఆర్ తగిన సలహాలు, సూచనలు ఇవ్వనున్నారని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. అధినేత కేసీఆర్ జస్ట్ అలా తెలంగాణ భవన్‌లో ఉంటే పార్టీ నేతలకు, క్యాడర్‌కు బూస్ట్‌ను ఇస్తుందనే చర్చ జరుగుతోంది.అది కచ్చితంగా స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందని, పార్టీ బలపరిచిన సర్పంచుల గెలుపుకు ఉపయోగపడుతుందని ముఖ్య నేతలు భావిస్తున్నారు. 2001లో పార్టీ పెట్టాక వచ్చిన మొదటి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా బలపడ్డారో..అలా ఇప్పుడు గ్రౌండ్ లెవల్‌లో పార్టీ బలోపేతం కోసం సర్పంచ్ ఎన్నికలకు అస్త్రంగా వాడుకునే ప్లాన్ చేస్తున్నారట. మరి నిజంగానే కేసీఆర్ తెలంగాణ భవన్‌కు వస్తారా..కేసీఆర్ తెరమీదకు వస్తే సర్పంచ్ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది వేచి చూడాలి మరి.

# ఢిల్లీ పోలీసుల ఆపరేషన్...

న్యూఢిల్లీ, నవంబర్ 27,

భారత్‌లో అల్లర్లు, దాడులు చేసేందుకు పాకిస్తాన్ సకల ప్రయత్నాలు చేస్తోంది. మన నిఘా వర్గాలు, పోలీసులు, సైన్యం ఈ కుట్రలను 99 శాతం పసిగడుతున్నాయి. ఒకటి రెండు మాత్రం మిస్ అవుతున్నాయి. అలాంటి సమయంలో పహల్గాం దాడి, తాజాగా ఢిల్లీ పేలుడు ఘటన జరిగాయి. ఢిల్లీ ఘటన తర్వాత పోలీసులు తాజాగా సోదాలు విస్తృతం చేశారు. ఈ తనిఖీల్లో అంతర్జాతీయ ఆయుధ సరఫరా ముఠాను పట్టుకున్నారు.ఢిల్లీ పోలీసులు పాకిస్తాన్ ఐఎస్ఐకి సంబంధిన ఆయుధాలను డ్రోన్ల ద్వారా భారత్‌లోకి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్టు చేశారు. ఈ ముఠా అధునాతన టర్కీ తయారీ జూలీ?5.7, చైనా తయారీ జూలీ?3 పిస్టళ్లు, 92 రౌండ్లను స్వాధీనం చేసుకున్నారు. విభాగం పరిశోధనల ప్రకారం, ఈ ముఠా డ్రోన్లను అతి తక్కువ ఎత్తులో ఎగిరిస్తూ పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో జీపీఎస్ సూచించిన ప్రదేశాల వద్ద ఆయుధాలను డ్రాప్ చేస్తూ, స్థానిక ముఠాలకు అందేలా చేస్తోంది. ఆయుధాలు దొరికిన తరువాత, వీటిని క్రిమినల్లు, హత్యల, దోపిడీల కోసం ఉపయోగిస్తున్నట్లు వెల్లడైంది.ఈ ఆయుధ ముఠాను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. మణిదీప్ సింగ్, దల్వీందర్, రోహన్ తోమర్, అజయ్ అలియాస్ మోను ను అరెస్టు చేశారు. వీరు పంజాబ్, ఉత్తరప్రదేశ్ వాసులుగా, పంజాబ్?యూఎస్ క్రిమినల్ గ్యాంగ్స్‌కు సంబంధం ఉన్నవారు. గ్యాంగ్ నేత సోను ఖత్రి (రాజేశ్ కుమార్) ప్రస్తుతం యూఎస్‌లో ఉన్న శ్రీమంత ఆయుధ వ్యాపార చరిత్ర కలిగిన వ్యక్తి. సోను ఖత్రి ఐఎస్ఐ సహకారంతో విక్రయానికి ఆయుధాలు సరఫరా చేస్తోంది. డ్రోన్ల వినియోగం ద్వారా రాడార్ గుర్తింపు తప్పించుకుని దేశంలోకి ఆయుధాలు పంపుతున్నారు. తాజా ఘటనతో ప్రస్తుతం పోలీసులు మరింత గట్టి చర్యలతో మిగతా కుట్రకారులను గుర్తించారు.నవంబర్ 19న పోలీసులకు సమాచారం అందింది. రోహిణిపట్‌లోని ఖాతూశ్యాం ఆలయం వద్ద గ్యాంగ్‌ను పట్టుకున్నారు. పిస్టళ్లు, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఫిలాపూర్‌కు చెందిన మణిదీప్, లూధియానాకు చెందిన దల్వీందర్ చిన్ననాటి మిత్రులు, గ్యాంగ్‌స్టర్ జస్‌ప్రీత్‌తో వీరికి సంబంధాలు ఉన్నాయి. జస్‌ప్రీత్ పాక్‌లోని ఐఎస్ఐ నుంచి ఆయుధాలు భారత్‌లోకి తెప్పిస్తున్నట్లు గుర్తించారు. ఢిల్లీతోపాటు దేశంలోని పలు గ్యాంకులకు ఆయుధాలు అందించారు. ఈ గ్యాంగులు ఆయుధాలు ఉపయోగించి హత్యలు, దోపిడీలకు పాల్పడుతున్నాయి.

# ఇక రెండు గంటల్లో చెన్నై

హైదరాబాద్, నవంబర్ 27,

చెన్నై- హైదరాబాద్ వాసుల బుల్లెట్ రైలు కల త్వరలో సాకారం కానుంది. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు మార్గం ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ నివేదికను దక్షిణ మధ్య రైల్వే తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించింది. ఇది ఇంటర్ సిటీ ప్రయాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చెన్నైకి రైలు ప్రయాణానికి దాదాపు 12 గంటలు పడుతోంది. కొత్త హైస్పీడ్ మార్గం అందుబాటులోకి వస్తే ఈ సమయం గణనీయంగా తగ్గి కేవలం 2.20 గంటలకు చేరుకుంటుంది.తమిళనాడు ప్రభుత్వం కోరిక మేరకు గతంలో గూడూరు మీదుగా ఉన్న ప్రణాళికను మార్చి తిరుపతిలో స్టేషన్‌ను చేర్చారు. తమిళనాడు రాష్ట్ర పరిధిలో మొత్తం రెండు స్టేషన్లు ప్రతిపాదించారు. తమిళనాడులో చెన్నై సెంట్రల్, చెన్నై రింగు రోడ్డు స్టేషన్ ఉంటాయి. అయితే వాణిజ్య, రవాణా సౌలభ్యం కోసం, రైల్వే శాఖ ప్రతి స్టేషన్ చుట్టూ దాదాపు 50 ఎకరాల స్థలాన్ని కోరింది.సమగ్ర ప్రాజెక్టు నివేదికపై ప్రభుత్వ ఆమోదం లభించిన నెలలోపు తుది నిర్ణయం తీసుకుంటామని చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ తెలిపింది. ఈ హైస్పీడ్ నెట్‌వర్క్ నిర్మాణంలో తమిళనాడు పరిధిలో 12 కి.మీ.ల సొరంగ మార్గం ఉండనుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 223.44 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇందులో అటవీ భూమి లేదని రైల్వే అధికారులు ధృవీకరించారు. ఈ మార్గం దాదాపు 65 రోడ్లు, 21 హైటెన్షన్ విద్యుత్తు లైన్లను దాటాల్సి ఉంటుంది. ప్రభుత్వ కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ నిర్వహించిన సర్వేల ఆధారంగా ఈ అలైన్‌మెంట్ రూపొందించారు.దక్షిణాదిన ప్రణాళికలో ఉన్న రెండు హైస్పీడ్ మార్గాలలో ఇది ఒకటి కాగా, రెండోది హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌గా ఉంది.

# కేసీఆర్ అలా.. రేవంత్‌రెడ్డి ఇలా..
## ఇద్దరి ఆలోచనలో ఎంత వ్యత్యాసం

హైదరాబాద్, నవంబర్ 27,

కేసీఆర్.. అలియాస్ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. తెలంగాణ ఉద్యమ సారధి. ప్రత్యేక రాష్ట్రానికి పదేళ్లు సీఎం. టీడీపీ నుంచే రాజకీయ ఓనమాలు నేర్చుకున్న కేసీఆర్.. తర్వాత పార్టీని వీడి.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రస్తుతం బీఆర్ఎస్ స్థాపించాడు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించారు. సబ్బండ వర్గాలను ఏకం చేశాడు. సకల జనుల పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది. ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు పదేళ్లు కేసీఆర్‌కు అధికారం ఇచ్చారు. తనవంతు బాధ్యతగా ఆయన తెలంగాణను చాలా అభివృద్ధి చేశారు. అయితే కేసీఆర్ ఆలోచనా విధానం అంతా నేనే.. అన్నట్లుగా ఉంటుంది. పదేళ్ల తర్వాత తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇక్కడ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి.. ఈయన కూడా టీడీపీలో రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారు. ఐదేళ్ల క్రితం కాంగ్రెస్‌లో చేరారు. చచ్చిపోయిందనుకున్న పార్టీకి పునరుజ్జీవం తెచ్చి.. అధికారంలోకి తీసుకువచ్చారు. సీఎంగా రెండేళ్లుగా పాలన సాగిస్తున్నారు. అయితే కేసీఆర్ ఆలోచనకు భిన్నంగా రేవంత్ ఆలోచనలు ఉంటున్నాయి.హైదరాబాద్ నగర అభివృద్ధి, పాలనా పనితీరు మెరుగుదలకి 27 మున్సిపాలిటీల్ని జీహెచ్ఎంసీకి విలీనం చేయడం కీలకం. గతంలో చిన్న మున్సిపాలిటీలుగా పనిచేస్తున్న ప్రాంతాలు ఇప్పుడు పెద్ద పరిధిలో సమన్వయపూర్వక అభివృద్ధికి దోహదం చేస్తాయి. ఇది నగరంలో నగర ప్రణాళిక, నిధి వినియోగ దిశగా సౌకర్యాలు త్వరితగతిన అందించేందుకు సహాయపడుతుంది.బ్యాటరీ స్టోరేజీ (బీఈఎస్ఎస్) ప్లాంట్లతోపాటు, పంప్డ్ హైడ్రో స్టోరేజీ సాంకేతికతలను కూడా ప్రోత్సహించి, పీకవర్స్, ఆఫ్ పీకవర్స్ సమయాల్లో విద్యుత్ సరఫరా నిలకడనిచ్చే చర్యలు తీసుకుంటున్నారు. ఇది పర్యావరణ హితం కలిగించే పునరుద్ధరించదగిన శక్తి వినియోగానికి దారితీస్తుంది.కేసీఆర్ ప్రభుత్వ కాలంలో తీసుకున్న కొన్ని విద్యుత్ రంగ నిర్ణయాలు నష్టదాయకమైనవి, సబ్‌క్రిటికల్ ప్లాంట్లు, అధికధర ప్రైవేట్ పవర్ కొనుగోలు, సరైన సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం మొదలైన లోపాల వలన నష్టాలు ఏర్పడ్డాయి. ఈ మార్గం వదిలించి నూతన విధానాలు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టడం తెలంగాణ పునరుద్ధరణ దిశ.మూడు వేల మెగావాట్ల సోలార్ పవర్ ఒప్పందాలు, మెట్రో, ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం వంటి ప్రాజెక్టులు కలిసి నగర అభివృద్ధి, విద్యుత్ వ్యవస్థల ఆధునికీకరణ తెలంగాణకు కొత్త మార్గనిర్దేశం చేశారు.కేసీఆర్ ప్రభుత్వ విధాన నష్టాలు, రేవంత్ రెడ్డి కొత్త సాంకేతికతల ప్రయోజనాలు, జీహెచ్ఎంసీ విస్తరణ, విద్యుత్ రంగంలో పరిష్కారాలు స్పష్టంగా గుర్తించవచ్చును. తెలంగాణ విద్యుత్ విధానానికి ఇది ఒక ప్రధాన దశాబ్దం, అది వేగంగా, స్థిరంగా అభివృద్ధి చెందుతుంది.

# పల్లెల్లో ప్రారంభమైన మొదలైన సందడి
## గ్రామాల్లో వేడెక్కిన రాజకీయాలు..

హైదరాబాద్, నవంబర్ 27,

రంగారెడ్డి జిల్లాలో ఎన్ని రోజులు వేచి చూసిన సందర్భం రానే వచ్చింది. స్థానిక సంస్థల్లో యుద్ధానికి తెరలేచింది. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు రావడం తో పల్లెలు వేడెక్కాయి. పల్లెల్లో మద్యం ఏరులై పారనునీది. అభ్యర్థులను ఇప్పటికే ఓటర్లు మద్యం డబ్బుల విషయమై ఫోన్లు చేసి అభ్యర్థులను ఇప్పటికే ఓటర్లు మద్యం డబ్బుల విషయమై ఫోన్లు చేసి మా ఇంట్లో ఇన్ని ఓట్లు ఉన్నాయి అంటూ మచ్చిగా చేసుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని రోజులు వేచి చూసిన సందర్భం రానే వచ్చింది.స్థానిక సంస్థల్లో యుద్ధానికి తెరలేచింది. గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రంగారెడ్డి జిల్లాలో ప్రతి గ్రామంలో ఎన్నికల జోష్ కనిపిస్తుంది. రంగారెడ్డి జిల్లాలో జిల్లా కలెక్టర్ ధపాల వారిగా పంచాయతీ, వార్డుల రిజర్వేషన్ విడుదల చేశారు.ఆయా రిజర్వేషన్ ప్రకారంగా పోటీ చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సిద్ధమవుతు న్నారు. ఇప్పటికే అధికార పార్టీ నేతలు ఎన్నికల్లో గెలిచేందుకు వ్యూహాలను సిద్ధం చేసుకున్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ, జనరల్ స్థానాలకు పోటీలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని రాజకీయ నాయకులు విశ్లేషణ చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో 526 పంచాయితీలు, 4668 వార్డులకు ఎన్నికలు మూడు విడతలో జరిగనున్నాయి.తొలి విడుత నవంబర్ 27 నుంచి నామినేషన్లు, పోలింగ్, ఫలితాలు డిసెంబర్ 11, రెండో విడత నవంబర్ 30 నుంచి నామినేషన్లు, డిసెంబర్




14 పోలింగ్, ఫలితాలు, మూడో విడత డిసెంబర్ 3 నుంచి నామినేషన్లు, డిసెంబర్ 17 పోలింగ్, ఫలితాలు ఉండవున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో జిల్లాలో సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.రంగారెడ్డి జిల్లాలో రాజకీయాలు వేడెక్కాయి. 42 శాతం బీసీ రిజర్వేషన్ ప్రకారంగా కేటాయించిన స్థానాల్లో పోటీ చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల నేతలు ప్రయత్నాలు చేశారు. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. దీంతో రిజర్వేషన్ లు తరుమారు కావడంతో జనరల్ స్థానాల్లో కూడా బిసి వర్గాలు పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ అయా నియోజకవర్గం ఉన్న ఎమ్మెల్యేలు ఎవరెవరిని పోటీలో నిలపలని ఆలోచన చేస్తున్నారు. జిల్లా లోని చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్లు ( కల్వకుర్తి), మహేశ్వరం, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం తదితర నియోజకవర్గంలో 526 పంచాయతీలు, 4668 వార్డు లను కైవసం చేసుకోవడానికి పార్టీ లు సిద్ధం అవుతున్నాయి.వీటి పరిధిలో 4682 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.ఆయా నియోజకవర్గంలో అధికార పార్టీనేతలు గెలుపు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దానికి తోడు ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో బీజేపీ, ఇతర పార్టీలు కలిసి పోటీ చేస్తున్నారో.. లేదో ఇంకా స్పష్టత రాలేదు. ఇప్పటికే ఆయా నియోజకవర్గంలో సర్పంచ్ అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పైచేయి వివిధ పార్టీలు సాధించేందుకు సిద్ధమయ్యారు.ప్రజలు ఎప్పడు ఎప్పుడా అని ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు సమయం దగ్గరపడుతున్న తరుణంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. గెలుపు గుర్రాలను బరిలో దింపేందుకు ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి.రిజర్వేషన్ మాట పక్కన పెడితే ఈ సారి ఏది ఏమైనా మనం అనుకున్న అభ్యర్థి గెలుపు కోసమే పని చేయాలని రహస్య ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసారి ప్రధాన పార్టీలకు ఎవరికి మద్దతు ఇస్తే వారిదే విజయం పొందే అవకాశాలను పార్టీలు, కొంతమంది అభ్యర్థులు చక్రం తిప్పనున్నారు.

42 శాతం అమలుకు ప్రతిపాదన..

తెలంగాణలో మొత్తం 12,735 గ్రామ పంచాయతీలకు బీసీలకు కేటాయించిన రిజర్వేషన్ల సంఖ్య కేవలం 2,176 మాత్రమే. అంటే 17.08% రిజర్వేషన్లు అమలు కావడం జరిగింది. కొన్ని జిల్లాలలో తీవ్ర వైవిధ్యంతో, భద్రాద్రి జిల్లాలో అతి తక్కువగా బీసీలకూ ఒక్క రిజర్వేషన్ కేటాయింపులు లేవు. మరోవైపు సిద్దిపేట జిల్లా 508 స్థానాలకు 136 కేటాయించారు. గత ఎన్నికలలో బీసీలకు 20% రిజర్వేషన్లు ఉన్నా, రొటేషన్ల వల్ల ఈసారి సంఖ్య తగ్గడం జరిగింది.ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని చాలా ప్రతిపాదనలు చేసినప్పటికీ, కోర్టు కేసులు వలన ఇప్పటివరకు ఈ రిజర్వేషన్ల అమలు నిలిపివేయాల్సి వచ్చింది. తెలంగాణ హైకోర్టు ప్రభుత్వం జారీ చేసిన 42% రిజర్వేషన్ ఆర్డర్ ను నిలిపివేసింది, కారణంగా ఇది 50% సుప్రీంకోర్టు నిర్ణయాన్ని మించిపోతుందని వాదనలు వినిపించాయి, మొత్తం రిజర్వేషన్ల శాతం 67% కు చేరువైందని తెలిపింది. ఈ సమస్యలు ఇంకా తీర్చులేకపోయాయి. ఇదే సమయంలో, ప్రభుత్వం దీనిని ప్రత్యేక జీవోల ద్వారా అమలు చేయాలని యత్నిస్తోంది, కానీ చట్టబద్ధమైన అనుమతులు ఇంకా గవర్నర్ మరియు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు బీసీ పదవుల కేటాయింపులో స్పష్టత లేకపోవడం, వారి రాజకీయ ప్రవేశాన్ని నిరోధించడంతో కూడా తీసుకున్నవి. ఇదే సమయంలో స్థానిక సంస్థల రాజకీయ స్వరూపంలో, సామాజిక న్యాయం విషయంలో ఈ వివాదాలు పెద్దగా ప్రతిఫలిస్తున్నాయి.

# విద్యార్థులకు నోట్ బుక్స్ అందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 27: మాచారెడ్డి మండలం సోమవార్ పేట్‌జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం



ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ ఆవరణలో ఎక్కడా చెత్త కనిపించకుండా శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. తరువాత పదవ తరగతి క్లాస్‌రూమ్ కి వెళ్లి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో పరస్పర సంభాషణ జరిపిన కలెక్టర్ పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెరగాలంటే ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని, టీచర్లు అందిస్తున్న మార్గదర్శకాలను పూర్తిగా వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. విద్యార్థుల విద్యాభ్యాసాన్ని మరింత మెరుగుపరచడానికి వారికి నోట్‌బుక్స్ ను స్వయంగా విద్యార్థులకు అందించి, పట్టుదలతో చదివి మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. తదుపరి విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్ తమకు ఇష్టమైన సబ్జెక్ట్ ఏమిటి? ఎందుకు ఇష్టం? అని అడిగి, విద్యార్థులు చెప్పిన విషయాలను ఆసక్తిగా విన్నారు. ఆ సబ్జెక్ట్ గురించి విద్యార్థుల మాటల్లో వచ్చిన వివరాలను విని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల అధ్యయన ఆసక్తిని అభినందించి ప్రతీ విద్యార్థికి నోట్‌బుక్స్ ను స్వయంగా అందజేశారు. మెనూ ప్రకారం భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను పకడ్బందీగా నిర్వహించాలని, ఫలితాలు మెరుగుపడేల కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు , తహసిల్దార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో జాగృతి బలోపేతమే మా లక్ష్యం

## –సైదాపూర్ మండలంలో మహిళల చేరికలు
## –జిల్లా అధ్యక్షులు గుంజపడుగు

కరీంనగర్, నవంబర్ 27(భారతశక్తి ప్రతినిధి):

ప్రజా సమస్యల పరిష్కారం కోసం జాగృతి జిల్లాలో జాగృతి జనతా గ్యారేజీలా పోరాడుతుందని జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ చెప్పారు.

గురువారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని



ఘనపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని మహిళ నాయకులు సుద్దాల రజిని ఆధ్వర్యంలో పలువురు మహిళలు జాగృతిలో చేరగ జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ కండువాలు కప్పి సాధారణంగా స్వాగతం పలికారు. గడప స్వరూప, పిట్టల సంగీత, కాసర్ల పద్మ, తాళ్ళపల్లి విజయ, కుట్ల రామ్య, బాసరాజు లావణ్య, శాంతావ్వ, అందె లక్ష్మీ, కుమారస్వామి, తిరుపతి, లత, సుద్దాల మంజుల జాగృతి కండువాలు కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం, అదేవిధంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ కోసం జాగృతి అధ్యక్షురాలు కవిత నిరంతరం కృషి చేస్తుందని మహిళల సమస్యల పరిష్కారానికి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సాధన కోసం ఢిల్లీ పార్లమెంట్ ముందు ధర్నా చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును సాధించిందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న గ్రూప్ విద్యార్థుల కోసం, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యువకుల, సింగరేణి ఉద్యోగుల సమస్యల పైన కవిత నాయకత్వంలో జాగృతి పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రంలో జాగృతి కార్యలయం ఒక జనతా గ్యారేజ్ లాగా పనిచేస్తుందని. ప్రజలు కవిత పేరు చెప్పుకుంటేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే అభిప్రాయం ఉందన్నారు. వచ్చే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి కవిత నాయకత్వం వహించాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సైదాపూర్ మండల జాగృతి ఇంచార్జ్ హాస్నాబాద్ రాజ్ కుమార్, మహిళా విభాగం నాయకురాలు జంగా అపర్ణ, ఆదివాసి జాగృతి జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, జాగృతి సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

## ఆదేశాలను పాటిస్తాం టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి

కరీంనగర్, నవంబర్ 27(భారతశక్తి ప్రతినిధి):

మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం జిల్లా టీఎన్జీవో సంఘం అధ్యక్షులు, జిల్లా ఉద్యోగుల సంఘం చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అపోలో



రిచ్ ఆసుపత్రి, జిల్లా మెడికల్, హెల్త్ శాఖ, వాసన్ ఐ కేర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ముందుగా శిబిరానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి టీఎన్జీవో జిల్లా నాయకులు పూల మొక్కతో ఘనంగా స్వాగతం పలికారు. గురువారం టీఎన్జీవోల సంఘ జిల్లా భవనంలో నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఅంగన్వాడి టీచర్లు, హెల్పర్లు ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎన్జీవోల సంఘం చేపట్టిన ఈ సామాజిక కార్యక్రమానికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రజాప్రయోజన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ ఆరోగ్య శిబిరంలో 300 మంది అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు, ఉద్యోగులు పాల్గొని రక్తపోటు, షుగర్, కంటి పరీక్షలు తదితర వైద్య సేవలు పొందారు. అనంతరం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళ ఆరోగ్యమే మహాభాగ్యం. మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా కలెక్టర్ చిరు ఉద్యోగులైనటువంటి అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లకు సంబంధించి ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహించేందుకుగాను మీ సహాయ సహకారమందించినందుకు తెలంగాణ ఎన్జీవోల సంఘం సదా కృతజ్ఞతగా ఉంటుందని చెప్పారు. తమకు సహకారం అందించిన డిఎంహెచ్వో వెంకటరమణ, సిబ్బందికి, అపోలో రీచ్ ఆసుపత్రి, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి ఉద్యోగుల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా సహాధ్యక్షులు ఒంటెల రవీందర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాశ్రీ, సనా నజవేరియా, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, మహిళా జేఏసీ నాయకులు ఇరుమల్ల శారద, సునీత, సరిత, విజయలక్ష్మి, లలితమేరీ, రమణ స్వరూపా, లక్ష్మీ, బాగ్యలక్ష్మి, ఉర్మీళ, అస్గర్ అలీ, వాస్తవి గౌడ్, కోమ్మెర శ్రీనివాస్ రెడ్డి, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల తొలి విడత నామినేషన్ల ప్రారంభం

## సిపి గౌస్ అలం పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు

కరీంనగర్, నవంబర్ 27(భారతశక్తి ప్రతినిధి):కరీంనగర్ జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా, మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిస్పక్షపాతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం గురువారం తెలిపారు.

నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు

మొదటి విడతలో చొప్పదండి, రామడుగు, గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ (05) మండలాల్లో నామినేషన్ల స్వీకరణ జరుగుతోంది. జిల్లావ్యాప్తంగా 33 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సీపీ గౌష్ ఆలం పర్యవేక్షణలో నామినేషన్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సందర్శన

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను స్థానిక పోలీసు అధికారులతో కలిసి సీపీ సందర్శించారు. ఎన్నికలు సజావుగా సాగేలా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు.



ఎన్నికల నియమావళి అమలు, బైండోవర్ చర్యలు

ఎన్నికల నియమావళి అమల్లోకి రాగానే శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు సీపీ తెలిపారు. గతంలో నేర చరిత్ర ఉన్న ఎన్నికల నేరస్థులను బైండోవర్ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో, నిస్పక్షపాతంగా ఎన్నికలు సజావుగా సాగేందుకు అవసరమైన అన్నీ చర్యలు చేపడతామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు. సిపి వెంట రూరల్ ఏసీపీ విజయకుమార్, రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి, చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, ఎస్సైలు రాజు , వంశీకృష్ణ, నరేష్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలపై ఏమైనా ఫిర్యాదులు ఉంటే ఈ నెంబర్లో 9959284786 సంప్రదించవచ్చు:గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 27 (భారత శక్తి): జిల్లాలో మూడు దశల్లో నిర్వహించబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే ప్రజలు తమను సంప్రదించవచ్చునని జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల



పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అటవీ శాఖ వసతి గృహం నందు తాము అందుబాటులో ఉంటామని, ఎన్నికలపై ఫిర్యాదులను ఇవ్వాలనుకున్నవారు నేరుగా సంప్రదించి, ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు. లేదా 9959284786 ఫోన్ నెంబర్ ద్వారానైనా ఫిర్యాదులపై సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. observergpnirmal@gmail.com మెయిల్ ఐడి ద్వారానైనా ఫిర్యాదులను వ్యక్తపరచవచ్చునని వివరించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఫిర్యాదులను నిర్భయంగా ఇవ్వవచ్చునని జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకులు ఆ ప్రకటనలో తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు

## –అక్రమ రవాణాకు చెక్
## –జిల్లా వ్యాప్తంగా 12 చెక్ పోస్టుల ఏర్పాటు
## "నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు" ఎస్పీ డా.జి.జానకి షర్మిల హెచ్చరిక



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 27 (భారత శక్తి):స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు నిర్మల్ జిల్లా పోలీసులు విస్తృత భద్రతా చర్యలను చేపట్టారు. ఈ క్రమంలో, జిల్లా వ్యాప్తంగా 8 ఇంటర్‌స్టేట్ చెక్ పోస్టులు, 4 ఇంటర్-డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు మొత్తంగా 12 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల సమయంలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మద్యం సరఫరా, డబ్బుల పంపిణీ, మరియు ఇతర ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైన చర్యలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

12 చెక్ పోస్టుల వివరాలు:

ఇంటర్‌స్టేట్ చెక్ పోస్టులు

- సారంగాపూర్ %-% రామ్‌సింగ్ తాండా చెక్ పోస్ట్

- కుబీర్ మండలం - మూడు చెక్ పోస్టులు:%-% సిర్పెల్లి హెచ్ చెక్ పోస్ట్%-% సేవాలాల్ తాండా చెక్ పోస్ట్%-% డోడర్న తాండా చెక్ పోస్ట్

కుంటాల - దౌనెల్లీ తాండా చెక్ పోస్ట్

తానూరు - రెండు చెక్ పోస్టులు:%-% బెల్ తరోడ చెక్ పోస్ట్%-% జవుల%-%బి చెక్ పోస్ట్

- బాసర - రెండు చెక్ పోస్టులు:%-%బిద్రెల్లి చెక్ పోస్ట్

ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు

బాసర - గోదావరి బ్రిడ్జి చెక్ పోస్ట్

ఖానాపూర్ - బాదనకుర్తి చెక్ పోస్ట్

కడెం - పాండవపూర్ చెక్ పోస్ట్

సోన్ - గంజాల్ టోల్ ప్లాజా చెక్ పోస్ట్. ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద అదనపు పోలీసు సిబ్బందిని నియమించినట్టు ఎస్పీ తెలిపారు. 24 గంటలు, షిఫ్ట్‌ల వారీగా వాహనాలు, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, అక్రమంగా తరలించే నగదు, మద్యం, ఆయుధాలు మరియు ఇతర ప్రలోభకర వస్తువులను అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలు మోహరించారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అనుచిత చర్యలకు తావివ్వకుండా పర్యవేక్షణను బలోపేతం చేసినట్టు, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక పర్యటనలు, రాత్రి గస్తీలు పెంచినట్టు ఎస్పీ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఏవైనా అనుమానాస్పద కదలికలు కనిపించిన వెంటనే సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# పంచాయతీ ఎన్నికల తొలి విడత నోటిఫికేషన్లు జారీ

## నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

## కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, నవంబర్ 27(భారతశక్తి ప్రతినిధి):

గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరిస్తూ జిల్లాలో జరిగే తొలి విడత సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్లు జారీ చేశారు. తొలి విడతలో కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గంగాధర, రామడుగు, చొప్పదండి, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లోని 92 సర్పంచ్, 866 వార్డు మెంబర్ల స్థానాలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రామడుగు మండలం వెదిర గ్రామ పంచాయతీ కార్యాలయంలో వెదిర, వెలిచాల గ్రామాల పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. అనంతరం నామినేషన్ స్వీకరణ కేంద్రంలో సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై అతికించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది



నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట రామడుగు తహసిల్దార్ రాజేశ్వరి, ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాష్, స్థానిక అధికారులు ఉన్నారు. పంచాయితి ఎన్నికల పరిశీలకులకు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్‌జిల్లాలో జరిగే పంచాయతీ ఎన్నికలకు జిల్లా పరిశీలకులు, HACA మేనేజింగ్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, పరిశీలకులు రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో సమావేశమయ్యారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, ఎన్నికలకు ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే పాల్గొన్నారు.

# ఘనంగా టీజీ క్యాబ్ & డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పుట్టినరోజు వేడుకలు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్27:

తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పుట్టినరోజు వేడుకలు హన్మకొండలోని



డీసీసీబీ బ్యాంక్ ప్రధాన కార్యాలయం లో బ్యాంక్ ఉద్యోగస్తుల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా చైర్మన్ రవీందర్ రావు కి ఉద్యోగస్తులందరు ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేయించడం జరిగింది. అనంతరం చైర్మన్ తన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన బ్యాంకు ఉద్యోగస్తులందరికీ ప్రత్యేక కృత్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎండి వజీర్ సుల్తాన్, జిఎం ఉషా శ్రీ, డిజిఎం అశోక్,ఏజిఎం లు గొట్టం స్రవంతి,మధు,కృష్ణ మోహన్,గంప స్రవంతి, యూనియన్ నాయకులు,బ్యాంకు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

# పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ విజిట్

కడప, నవంబర్ 27(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం



జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో పులివెందుల సబ్ జైలు సూపర్డెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# ప్రాధాన్యత మేరకు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలి: జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కడప, నవంబర్ 27(భారత శక్తి): ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో లక్ష్యం మేరకు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి వరి ధాన్యం కొనుగోలు, మహిళలపై నేర నియంత్రణ, గంజాయి, మత్తు పదార్థాల నివారణ, సానుకూల ప్రజా దృక్పథం, జీఎస్ డబ్ల్యుఎస్ సేవలు, మున్సిపల్ సేవలు – పారిశుద్ధ్య చర్యలు, ఆర్.టి.జి.ఎస్, సంక్షేమ శాఖ హాస్టళ్లు మరియు రెసిడెన్షియల్ పాఠశాలలు, తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జేసీ అదితి సింగ్ హాజరయ్యారు.సిఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబందిత అధికారులతో జేసీ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సంబందిత శాఖల అధికారులు ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు, మాధకద్రవ్యాల నిరోధం, గ్రామవార్డు సచివాలయాల్లో సేవల మెరుగు.. తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా సేవలను



మెరుగుపరచాలన్నారు. ఈ విషయంలో అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్రమం తప్పకుండా మీటింగ్స్ నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి

## (రాజ్యాంగ ఆమోద వారోత్సవాల సందర్భంగా)

కేంద్రప్రభుత్వంనూతనవిద్యావిధానంలో భాగంగాప్రభుత్వ 'ప్రైవేట్ విద్యా' సంస్థల్లో ప్రాథమిక స్థాయి నుండి పీజీ స్థాయి వరకు రాజ్యాంగాన్ని" కంపల్సరీ పాఠ్యాంశంగా" ప్రవేశ పెట్టి పౌరులకు రాజ్యాంగంపై అవగాహన కలిగించాలి. భారతరాజ్యాంగంఉనికిలోకివచ్చి 75సంవత్సరాలైఆజాద్కా అమృతోశ్చవాలు జరుపుకుంటు న్నప్పటికజనబాహుళ్యంలో



ఆశించినమేరకు రాజ్యాంగం గురించిన అవగాహన పరిజ్ఞానం ప్రచారంచేయడములో కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయి. రాజ్యాంగం అంశాలపై అవగాహన కల్పించాలి.

రాజ్యాంగంలోని అంశాలు స్థానిక రాష్ట్ర ' కేంద్ర ప్రభుత్వాల ఏరుపాటు చట్టసభలు 'అభ్యర్థుల ఎన్నిక విధానం 'రాష్ట్రపతి 'ఉపరాష్ట్రపతి ఎన్నిక గవర్నర్ల నియామకం కేంద్ర జాబితా రాష్ట్ర జాబితా ఉమ్మడి జాబితా అంశాల పట్ల అవగాహన ఎన్నికల సంఘం సుప్రీమ్ కోర్ట్ హై కోర్టు లకు జడ్జీల నియామకం ప్రభుత్వాల ఏర్పాటు మొన్నగు అంశాల మీద అవగాహన కల్పించాలి. చట్టాలు ప్రాథమికహక్కులు ' పౌరహక్కుల రాజకీయ " సామాజిక భద్రత చట్టాలపట్ల ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నం జరుగలేదు.రాజ్యాంగం బ్రహ్మ పదార్థం .రాజ్యాంగం అంటేఎవ్వరికీ అర్థం కానీబ్రహ్మపదార్థం"ఐయ్యింది.రాజ్యాంగ మంటే "ఆంబేడ్కర్" రచించాడు అని మాత్రమే చాలా మందికి తెలుసు.

రాజ్యాంగం ప్రజలకు అవగాహన

కేంద్ర ప్రభుత్వం ప్రతి పౌరునికి ఆధార్ కార్డు ఇచ్చి పౌరసత్వ గుర్తింపు ఇచ్చినట్లే ప్రతి పౌరునికి రాజ్యాంగాన్ని ఉచితంగా అందించాలి.రోడు మీద 'భగవద్గీత ' బైబిల్ కురాన్మత గ్రంథాలను ఉచితంగా లేదాతక్కువ ధరలకు అమ్మి నట్లురాజ్యాంగాన్ని వాడుకబాషలో ప్రింట్ చేసి ప్రజలకు పంచిపెట్టాలి. రాజ్యాంగ పట్ల అవగాహన 'చైతన్య సదస్సులు' చర్చాఘోస్టులునిర్వహించాలి .వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా కళారూపాల ద్వారా వాడుక బాషలో నాటక ప్రదర్శన ద్వారా గ్రామీణులకు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగించాలి.

,రాజ్యాంగం విశ్వసనీయత

ఇటీవల రాజ్యాంగాన్ని మార్చాలని రద్దుచేయాలని అడ్డదారిలో రాజ్యాంగాన్ని నిట్టనిలువునా చీల్చే వ్యూహాలను నిలువరించాలి . జాతీయ స్థాయిలోచర్చలు వాదోప వాదాలుజరుగుతున్నాయి. సర్వసత్తాకప్రజాస్వామ్యలౌకికస్వామ్యవాధ లక్ష్యాలఅమలుతోనే సామాజిక ఆర్థిక న్యాయం సిద్ధిస్తుంది. ప్రపంచ చరిత్రలోనే అరుదైన అపురూప రాజ్యాంగాన్ని చట్టాలను రక్షించే పరిజ్ఞానం అవగాహన చైతన్య ము వచ్చినప్పుడేరాజ్యాంగ ఫలాలు పేదవర్గాలకు అందుతాయి. చట్టాలు పేదవర్గాలకు చుట్టాలు అనే విశ్వసనీయత ప్రజల్లోనెలకొనే విధంగా ప్రభుత్వం వ్యవస్థాగత సంస్కరణలు చేపట్టాలి.

రాజ్యాంగం ప్రగతిశీల పాలన

ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య చరిత్ర లో అధికారంలో వున్న పార్టీలు ప్రభుత్వాలు రాజ్యాంగ బద్దంగా పాలనా వ్యవహారాలను నిర్వహిస్తే ఆశించిన ప్రజా సంక్షేమము సామాజికఆర్థికప్రగతిసిద్ధించేది.ప్రజలలోరాజ్యాంగ అంశాలు ఆర్టికల్స్ పట్ల అవగాహన పరిజ్ఞానంవుంటే ప్రగతిశీలసమాజము ఆవిర్భవిస్తుంది. నిజానికి రాజ్యాంగం గురించి తెలిస్తే ప్రజలు పాలకులను ప్రభుత్వ అధికారులను ప్రశ్నిస్తారు.పాలనలో పౌరుల సంపూర్ణ భాగస్వామ్యం పెరిగి రాజ్యాంగ పీఠికలో పేరుకొన్న స్వేచ్ఛ స్వాతంత్ర్యం సమానత్వం సిద్ధించిసామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో అందరికీ సమాన అవకాశాలు కలిగి సామాజిక న్యాయం పంపిణీ న్యాయం జరుగుతుంది. రాజ్యాంగం పట్ల అవగాహన పరిజ్ఞానం వున్న ప్రజలు అంటేఅధికారంలో వున్నరాజకీయ పార్టీకిఅధికారంలోవున్నప్రభుత్వాలకు పాలకవర్గాలకు ప్రభుత్వ యంత్రాంగానికిభయంనెలకొనిది .ప్రజాసమస్యల పరిష్కారదిశగా దృష్టి పెట్టకుండాప్రజలను" మాటల మాయా ప్రపంచంలోకి "నెట్టి వేస్తూ ప్రజలదృష్టినిసమస్యలపరిష్కారము కొరకు కాకుండా కాలయాపన చేస్తున్నారు నమయాన్నిదుర్వినియోగం చేస్తున్నారు.రాజ్యాంగంలో పేరుకొన్న సంక్షేమ రాజ్య స్థాపన సంక్షోభాలను నిలయం కావడం శోచనీయం.

రాజ్యాంగం మేధావులు

దేశములోకొంత మందిమేధావులకు మాత్రమేరాజ్యాంగంమీదఅవగాహన వుంది..దేశములో రాజ్యాంగంపై సంపూర్ణఅవగాహనవున్నఅడ్వకేట్స్ సంఖ్యకొద్దిగానేవుంది.విద్యావంతుల మేధావుల రాజ్యాంగ నిపుణుల సూచనలు సలహాలు పాటించే పాలకులు ప్రభుత్వాలుఅధికారంలో వున్న రాజకీయ పార్టీలకు శ్రద్ధ లోపించింది. రాజకీయ పార్టీలు

లిరాజ్యాంగం చట్టాలు శిక్షణలి"రాజకీయ పార్టీలు తమ కార్యకర్తలకు రాజ్యాంగం చట్టాల పట్ల.శిక్షణ అవగాహన తరగతులు నిర్వహించాలి .రాజకీయపార్టీలురాజ్యాంగ పరిజ్ఞానంచట్టాల ఉద్దేశ్యాలు వాటి అమలు తీరుతెన్నులు సమాజము పైచట్టాలప్రభావంపైఅవగాహన పరిజ్ఞానం దేశ చరిత్ర సంస్కృతి భౌగోళిక వనరులు సహజవనరుల లభ్యత వినియోగం పై అవగాహన వున్న అభ్యర్థులకు ఎన్నికల్లోటికెట్లు ఇవ్వాలి . ప్రజల అభివృద్ధికి ఏమిచెయ్యాలి? ఎలా చేయాలి? ఎవరికోసం చెయ్యాలి? అన్న అంశాల మీద పరిజ్ఞానం వున్న వారే ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు కృషి చెయ్యాలి.

కుటుంభం యూనిట్ గా రాజ్యాంగ అవగాహన

కుటుంబాన్నియూనిట్గాతీసుకోనితల్లితండ్రులుతమపిల్లలకురాజ్యాంగం మీద అవగాహన కలిగించాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలుపూర్తిచేసుకొన్నసందర్భంగా ప్రతి ఇంటి మీద జాతీయ జెండాను ఎగురవేసినట్లు ప్రభుత్వం ప్రతి ఇంటికి రాజ్యాంగాన్ని కానుకగా ఇవ్వాలి.

రాజ్యాంగం పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి

విధ్యాసంస్తల్లో విద్యార్థి సంఘాల కు ఎన్నికలు నిర్వహించి విద్యార్థి దశ లోనే ప్రజాస్వామ్యం రాజ్యాంగ ము పైన అవగాహన చైతన్యం కలిగించాలి.ప్రభుత్వం కేజీ టు పిజి వరకు రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి.

నేదునూరి కనకయ్యమాజీ కరస్పాండెంట్జస్టిస్ కుమారయ్యా లా కాలేజీ కరీంనగర్రాష్ట్ర అద్యక్షులుతెలంగాణ ఎకనామిక్ ఫోరం నాష్విల్ టేనస్సీ అమెరికా9440245771

# శిశుగృహ, బాలసదనం పిల్లల దత్తత

కరీంనగర్, నవంబర్ 27(భారతశక్తి ప్రతినిది): కరీంనగర్ శిశు గృహలో పెరుగుతున్న నాలుగు నెలల వయసున్న ఆడ శిశువును హుస్నాబాద్ కు చెందిన పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకున్నారు. బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న 13 సంవత్సరాల బాలికను తమిళనాడుకు చెందిన పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకున్నారు. మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా దంపతులకు పిల్లలను దత్తత ఇచ్చారు.



జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో జరిగిన ఈ దత్తత కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. అనాథ శిశువుల దత్తత, రక్త సంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, డి సి పి ఓ పర్వీన్, ప్రొటెక్షన్ ఆఫీసర్ తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, సాదినేని రమేష్ పాల్గొన్నారు.

# తొలి విడత సర్పంచ్, వార్డు స్థానాలకు నోటిఫికేషన్ లు జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 27: మాచారెడ్డి మండలం సోమవార్ పేట్ గ్రామ పంచాయితి కార్యాలయంలో గురువారం నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామ పంచాయతి ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరిస్తూ




కామారెడ్డి జిల్లాలో తొలి విడత సర్పంచ్, వార్డు స్థానాలకు నోటిఫికేషన్ లు జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాలైన కామారెడ్డి, బిక్నూర్, బీబీ పేట్, దోమకొండ, మాచారెడ్డి, పల్వంచ, రాజం పేట్, రామారెడ్డి, సదాశివ నగర్, తాడ్వాయి మండలాల పరిధిలోని సర్పంచ్ 167, వార్డు 1520 స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్, పోలింగ్ కేంద్రాలు 1533.

ఈ సందర్భంగా మాచారెడ్డి మండల కేంద్రంలోని సోమవార్ పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. నామపత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు, నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాల ప్రదర్శనను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా , పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, పత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ, ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ సరళ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు సయ్యద్ సలావుద్దీన్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 29( భారత శక్తి): జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు సయ్యద్ సలావుద్దీన్.గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాకు వ్యయ పరిశీలకులుగా (ఎక్స్పెండ్ టీచర్ అబ్జర్వర్) నియమించబడ్డ సయ్యద్ సలావుద్దీన్, గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

అనంతరం ఇరువురు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై చర్చించారు.



# రైతులకు సీసీఐ కేంద్రాల్లో నేరుగా పత్తి అమ్ముకునే అనుమతి : జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 27: పత్తి రైతుల సౌకర్యార్థం, మద్నూర్ సీసీఐ సెంటర్కు దూరంగా ఉన్న మండలాల రైతులకు సమీపంలోని ఇతర నాలుగు సీసీఐ సెంటర్లలో పత్తి అమ్ముకునే వెసులుబాటు కల్పించబడిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు.రైతులు తమకు దగ్గరగా ఉన్న వేములవాడ, దౌలతాబాద్, సిద్దిపేటతోగుట్ట సీసీఐ సెంటర్లలో పత్తిని అమ్ముకోవచ్చునని,

స్లాట్ బుకింగ్లో ఈ సెంటర్లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే, ప్రతి ఎకరాకు 7 క్వింటాళ్ల కంటే ఎక్కువ దిగుబడి వచ్చిన రైతులు, తమ ఏ ఇ ఓ (వ్యవసాయ విస్తరణ అధికారి) వద్దకు వెళ్లి అదనపు దిగుబడిని ఆన్లైన్లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఈ నమోదు పూర్తయిన తర్వాత, సంబంధిత రైతులకు సీసీఐ కేంద్రాల్లో నేరుగా పత్తి అమ్ముకునే అనుమతి లభిస్తుందన్నారు.




# వరల్డ్‌కప్ క్వీన్ దీప్తి శర్మ కోసం హైడ్రామా..

## ఏకంగా రూ.3.20కోట్లతో..

మహిళల ప్రీమియర్ లీగ్ 2026 కోసం నిర్వహించిన మెగా వేలంలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. భారత ఆల్‌రౌండర్, మహిళల ప్రపంచకప్ టోర్నీలో కీలకంగా వ్యవహరించిన దీప్తి శర్మ కోసం హైడ్రామా నడిచింది. తొలుత ఆమెను దక్కించుకునేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడగా.. 'ఆర్‌టీఎం' కార్డ్ ఉపయోగించి యూపీ ఏకంగా రూ.3.20కోట్లతో ఆమెను జట్టులోకి తీసుకుంది. ఈ ఏడాది జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ (WPL)లో యూపీ జట్టుకు దీప్తి శర్మ కెప్టెన్‌గా వ్యవహరించింది. అయితే, మెగా వేలానికి ముందు ఈ జట్టు దీప్తిని రిటైన్ చేసుకోలేదు. దీంతో గురువారం జరిగిన వేలంలో తొలి సెట్‌లో దీప్తి శర్మను కనీస ధర రూ.50లక్షలకు తీసుకునేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ ఆసక్తి చూపించింది. ఆ సమయంలో యూపీ వారియర్స్ 'రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం)' అవకాశాన్ని వినియోగించుకుంది. గతంలో ఒక జట్టుకు ఆడిన క్రీడాకారులను మళ్లీ వేలంలో దక్కించుకునేందుకు ఫ్రాంఛైజీలకు ఉండే సదుపాయం ఇది. ఇప్పుడు ఈ ఆర్‌టీఎం కార్డును యూపీ ఉపయోగించుకోగానే.. ఢిల్లీ ఫ్రాంఛైజీ తన బిడ్‌ను రూ.3.20 కోట్లకు పెంచేసింది. ఆ



ధరకు యూపీ వారియర్స్ అంగీకరించడంతో దీప్తి శర్మ మళ్లీ పాత జట్టుకే వెళ్లిపోయింది. అంత మొత్తం వెచ్చించేందుకు యూపీ జట్టు వెనుకాడకపోవడంతో ఢిల్లీ క్యాంప్‌లో ఉన్న సౌరభ్ గంగూలీ ఆశ్చర్యపోయారు. ఈ ధరతో డబ్ల్యూపీఎల్‌లో ఇప్పటివరకు రెండో అత్యధిక ధర కలిగిన క్రీడాకారిణిగా దీప్తి శర్మ నిలిచింది. గతంలో స్మృతి మంధానను బెంగళూరు జట్టు రూ.3.4కోట్లకు దక్కించుకుంది. ఇటీవల జరిగిన మహిళల ప్రపంచకప్ టోర్నీలో దీప్తి శర్మ అద్భుతంగా రాణించిన సంగతి తెలిసిందే. అటు బ్యాట్‌తోనూ.. ఇటు బంతితోనూ అదరగొట్టి ఫైనల్ పోరులో టీమ్‌ఇండియాకు కప్పు అందించడంలో కీలక పాత్ర పోషించింది. 215 పరుగులు, 22 వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచింది.

*** డబ్ల్యూపీఎల్ 2026 వేలం.. ఇప్పటివరకు ఎవరికి ఎంతంటే..?**

- సోఫీ డివైన్ రూ.2 కోట్లు (గుజరాత్ జెయింట్స్)
- దీప్తి శర్మ రూ.3.20 కోట్లు (యూపీ వారియర్స్)
- అమెలియా కెర్ రూ.3 కోట్లు (ముంబయి ఇండియన్స్)
- రేణుకా సింగ్ రూ.60లక్షలు (గుజరాత్ జెయింట్స్)
- సోఫీ ఎకిల్‌స్టోన్ రూ.85లక్షలు (యూపీ వారియర్స్) (ఆర్‌టీఎం)
- మెగ్ లానింగ్ రూ.1.90 కోట్లు (యూపీ వారియర్స్)

లారా వొల్వార్డ్ రూ.1.10కోట్లు (ఢిల్లీ క్యాపిటల్స్)
శ్రీ చరణి రూ.1.30కోట్లు (ఢిల్లీ క్యాపిటల్స్)




## WPL 2026: జనవరి 9 నుంచి

# మహిళల ప్రీమియర్ లీగ్

మహిళల ప్రీమియర్ లీగ్ జనవరి 9న ప్రారంభంకానుంది. ఈ మేరకు గురువారం బీసీసీఐ ప్రకటించింది. ఫిబ్రవరి ఐదు వరకు ఈ టోర్నీ కొనసాగనుంది. నవీ ముంబయి, వడోదరలో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయని వెల్లడించింది. అయితే దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్ విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం ఢిల్లీలో డబ్ల్యూపీఎల్ మెగా ఆక్షన్ సందర్భంగా ఆ లీగ్ ఛైర్మన్ జయేశ్ జార్జ్ ఈ తేదీలు, వేదికల గురించి వెల్లడించారు. మహిళల ప్రపంచకప్ ఫైనల్ జరిగిన నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో ఈ నాలుగో సీజన్ ప్రారంభం కానుంది. ఫైనల్ మ్యాచ్‌కు వడోదరలోని బీసీఏ స్టేడియం వేదికకానుంది. గత సీజన్‌లో బెంగళూరు, లఖ్‌నవూ, ముంబయి, వడోదరలో ఈ మ్యాచ్‌లు జరిగాయి. ముంబయిలోని బ్రబోర్న్ స్టేడియంలో మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్ జరగ్గా.. ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి ముంబయి ఇండియన్స్ కప్ గెలిచింది. ఇప్పటివరకు జరిగిన మూడు సీజన్లలో ఆ జట్టే రెండుసార్లు విజేతగా నిలిచింది. సెకండ్ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం దక్కించుకుంది. ఇటీవల మహిళల వన్డే ప్రపంచ కప్‌ను భారత జట్టు గెలుచుకున్న విషయం తెలిసిందే. హర్మన్‌ప్రీత్ కౌర్ సేన దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో గెలుపొందింది. షఫాలీ వర్మ (87), దీప్తి శర్మ (58) బ్యాట్, బంతితో అదరగొట్టారు. దాంతో మహిళల క్రికెట్‌పై అందరి దృష్టి పడింది. ఇప్పుడు ఈ వేలంలో దీప్తి శర్మను యూపీవారియర్స్ రూ.3.20 కోట్లకు తన జట్టులోకి తీసుకుంది.

# స్మృతి మంధానకు మద్దతుగా.. జెమీమా కీలక నిర్ణయం

భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన తండ్రి అనారోగ్యానికి గురవడంతో ఆమె వివాహం వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమె స్నేహితురాలు, క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌కు దూరమైంది. ఈ విషయాన్ని బ్రిస్బేన్ హీట్ జట్టు వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో స్మృతికి మద్దతుగా ఉండేందుకు ఆమె తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తున్నట్లు తెలిపింది. నవంబరు 9న మహిళల బిగ్‌బాష్ లీగ్ 11వ సీజన్ ప్రారంభమైంది. ఇందులో బ్రిస్బేన్ హీట్ జట్టుకు జెమీమా ప్రాతినిధ్యం వహిస్తోంది. అయితే, స్మృతి మంధాన వివాహం నిమిత్తం 10 రోజుల క్రితం జెమీమా భారత్‌కు తిరిగొచ్చింది. కానీ, అనివార్య కారణాల వల్ల ఆ వేడుకలు నిలిచిపోయాయి. దీంతో స్మృతి, ఆమె కుటుంబానికి మద్దతుగా ఉండేందుకు జెమీమా స్వదేశంలోనే ఉండాలని నిర్ణయించుకున్నట్లు బ్రిస్బేన్ హీట్ జట్టు సీఈఓ టెర్రీ స్వెన్సన్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ''జెమీకి ఇది నిజంగా సవాలుతో కూడుకున్న సమయం. ఆమె బిగ్‌బాష్ లీగ్‌లో కొనసాగకపోవడం అభిమానులకు అసంతృప్తి కలిగించే విషయమే. కానీ, ఆమె వ్యక్తిగత ప్రాధాన్యాలను గౌరవించాల్సిన అవసరం ఉంది. అందుకే ఆమె అభ్యర్థనను మేం అంగీకరించాం.



ఆమెకు, స్మృతి మంధాన కుటుంబానికి మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తున్నాం'' అని టెర్రీ స్వెన్సన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్‌తో స్మృతి వివాహం ఇటీవల చివరి నిమిషంలో నిలిచిపోయిన సంగతి తెలిసిందే. వాస్తవానికి స్మృతిపలాశ్ వివాహం నవంబరు 23 బెంగళూరు వేదికగా జరగాల్సి ఉంది. అయితే, వివాహ వేడుకల్లో పాల్గొంటుండగా స్మృతి తండ్రి అనారోగ్యానికి గురవడంతో వెంటనే ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి పరిస్థితుల్లో తనకు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని, అందుకే పెళ్లిని వాయిదా వేయాలని స్మృతి నిర్ణయం తీసుకున్నట్లు ఆమె మేనేజర్ ప్రకటించారు.




# పాపం.. వారికి నిద్ర కావాలి

## సుందర్ పిచాయ్ ఆసక్తికర వ్యాఖ్యలు

జెమిని ప్రో ప్లాన్ కింద గూగుల్ సరికొత్త జెమిని 3 మోడల్‌ను తీసుకువచ్చింది. దీనిద్వారా ఇతర ఏఐ సంస్థలకు గట్టి పోటీ ఇస్తోంది. ఈ నేపథ్యంలో సీఈఓ సుందర్ పిచాయ్ ఆసక్తికరవ్యాఖ్యలు చేశారు. తన ఉద్యోగులకు తగినంత నిద్ర కావాలని వ్యాఖ్యానించారు. 'గూగుల్ ఏఐ: రిలీజ్ నోట్స్' పాడ్‌కాస్ట్‌లో సుందర్ పిచాయ్ మాట్లాడారు. జెమిని 3ని విడుదల చేయడానికి ముందు కొన్నివారాల పాటు తన బృందం నిర్విరామంగా పనిచేసిందని చెప్పారు. దాంతో వారంతా ఎంతో అలసిపోయారని, పాపం కొందరు ఉద్యోగులకు నిద్ర అవసరమని భావించినట్లు చెప్పారు. వారందరికీ తగినంత విశ్రాంతి దొరికిందనుకుంటున్నట్లు వెల్లడించారు. నవంబర్ 18న గూగుల్ అధునాతన ఏఐ మోడల్ జెమిని 3ని లాంచ్ చేసింది. ఇది



వినియోగదారులను ఆకట్టుకోవడంతో గూగుల్ షేర్లు భారీగా పెరిగాయి. దాంతో సంస్థ మార్కెట్ వ్యాల్యూ 4 ట్రిలియన్ డాలర్లకు చేరువవుతోంది. ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్ వంటి సంస్థల నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్న సమయంలో గూగుల్ ఈ మోడల్‌తో ఏఐ రేసులోకి దూసుకొచ్చినట్లయింది. వేగం, రీజనింగ్ సామర్థ్యం విషయంలో జెమిని3 ప్రశంసలు అందుకుంటోంది.

## 4 ట్రిలియన్ డాలర్ల

# 'యాపిల్ ' స్టోరీ.. అదో దురదృష్టకర నిర్ణయం..!

అదృష్టం ఒక్కసారే తలుపు తడుతుంది.. దురదృష్టం తలుపు బద్దలు కొట్టుకొస్తుంది అనే సామెత యాపిల్ వ్యవస్థాపకుల్లో ఒకరైన రోనాల్డ్‌వేన్ అలియాస్ రాన్‌వేన్‌కు అతికినట్లు సరిపోతుంది. అతని స్టోరీ తెలుసుకుంటే భూప్రపంచంలో అంత దురదృష్టవంతుడు లేడనిపిస్తుంది. యాపిల్ పెట్టిన కొద్ది రోజులకే తన వాటాను అమ్మేసుకుని.. వందల కోట్ల డాలర్లు చేజార్చుకున్నాడు. ఈ కంపెనీకి బీజం పడినప్పుడు రాసుకొన్న పత్రాలు ఇప్పుడు వేలానికి రానున్నాయి. ఆ కాగితాల్లోని ఈ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. 1976లో అమెరికా రాష్ట్రం కాలిఫోర్నియాలోని ఒక చిన్న గరాజ్‌లో స్టీవ్ జాబ్స్, స్టీవ్ వోజ్నియాక్, రాన్‌వేన్‌తో కలిసి యాపిల్ కంప్యూటర్స్‌ను ప్రారంభించారు. ఆ సంస్థను స్థాపించిన సమయంలో కుదుర్చుకున్న కాంట్రాక్ట్ ప్రకారం.. స్టీవ్ జాబ్స్, వోజ్నియాక్‌కు చెరో 45 శాతం వాటా దక్కింది. రాన్‌వేన్ 10 శాతం షేర్ సొంతం చేసుకున్నారు. అయితే ఆ భాగస్వామ్యం ఎంతోకాలం నిలవలేదు. 12 రోజుల తర్వాత వేన్ ఆకస్మికంగా తన వాటాను వదులుకొని సంస్థను వీడారు. అప్పుడు యాపిల్ ప్రారంభ దశలో ఉంది. ఇప్పుడు అది నాలుగు ట్రిలియన్ డాలర్ల కంపెనీ. అప్పట్లో వేన్ తీసుకున్న నిర్ణయాన్ని ఘోర పరిణామంగా వ్యాపారవర్గాలు ప్రస్తావిస్తుంటాయి. ఆ పది శాతం వాటా అమ్మగా రూ.4 లక్షలు అందాయి. అదనంగా మరో రూ.1.3 లక్షలు పొందారు. యాపిల్ షేర్ వదులుకోవడం అత్యంత జాగ్రత్తతో తీసుకున్న నిర్ణయమని గతంలో వేన్ వెల్లడించారు. ఒకవేళ ఆయన సంస్థలోనే ఇప్పటికీ ఉండిఉంటే.. ఆ



10 శాతం విలువ 400 బిలియన్ డాలర్లుగా ఉండేది. ఈ వాటాను అమ్మి రాన్ ఏమైనా సాధించాడా అంటే అదీ లేదు.. చివరికి సాధారణ ఎగ్జిక్యూటీవ్‌గా జీవితం గడిపాడు. ఇప్పుడు ఈ ఒరిజినల్ పత్రాలను అమెరికా ఆక్షన్ హౌస్ క్రిస్టీ వేలం వేయనుంది . న్యూయార్క్‌లో జనవరి 23, 2026న ఈ వేలం నిర్వహించనున్నారు. ఆ మూడు పేజీల డాక్యుమెంట్‌పై ముగ్గురు వ్యవస్థాపకుల సంతకాలు ఉన్నాయి. ఆ డాక్యుమెంట్‌ను ఐబీఎం టైప్‌రైటర్‌పై రాన్‌వేన్ టైప్ చేశారు. దాంతో పాటు తన వాటాను ఉపసంహరించుకున్న పత్రాలు క్రిస్టీకి చెందిన 'We the People: America at 250' వేలంలో భాగం కానున్నాయి. ఈ ఆక్షన్‌లో రూ.17.8 కోట్ల నుంచి రూ.35.6 కోట్ల వరకు వస్తాయని క్రిస్టీ అంచనా వేస్తోంది. అమెరికా ఎట్ 250 ద్వారా అమెరికా 250 ఏళ్ల సృజనాత్మకతను ప్రదర్శించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో యాపిల్ పత్రాలే హైలైట్ అని భావిస్తోంది.

# బుల్ పరుగులు.. రికార్డు గరిష్ఠానికి నిఫ్టీ



ముంబయి: దేశీయ మార్కెట్లు గురువారం లాభాల్లో పరుగులు పెడుతున్నాయి. ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాలు, విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్‌ఐఐలు) కొనుగోళ్లు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయి. దీంతో నేటి ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు సరికొత్త రికార్డులను తాకాయి. సెన్సెక్స్ తొలిసారి 86వేల మార్క్‌ను దాటగా.. నిఫ్టీ జీవనకాల గరిష్ఠ స్థాయిలో ట్రేడ్ అవుతోంది. ఉదయం 10.50 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ 410 పాయింట్ల లాభంతో 86,021 వద్ద, నిఫ్టీ 83.6 పాయింట్ల లాభంతో 26,288 వద్ద కొత్త గరిష్ఠాల్లో ట్రేడ్ అవుతున్నాయి. నిఫ్టీ గతేడాది సెప్టెంబరులో నమోదైన 26,277 రికార్డ్ మార్క్‌ను తాజాగా అధిగమించింది. ఇక, డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు పడిపోయి 89.24గా కొనసాగుతోంది. నిఫ్టీలో హిందాల్కో, ఎల్ అండ్ టీ, ఎన్టీపీసీ, జియో ఫైనాన్షియల్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు రాణిస్తున్నాయి.

## మహీంద్రా నుంచి 7సీటర్ ఈవీ..

# ఒక్కసారి ఛార్జ్ చేస్తే 679 కిలోమీటర్లు..!

ప్రముఖ ఆటో మొబైల్ సంస్థ మహీంద్రా సరికొత్త ఎలక్ట్రిక్ వాహనాన్ని మార్కెట్లోకి లాంచ్ చేసింది. ఎక్స్‌ఈవీ 9ఎస్ పేరుతో దీన్ని ఆవిష్కరించింది. ఈ కంపెనీ విడుదల చేసిన తొలి 7 సీటర్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఇదే కావడం విశేషం. దీని ప్రారంభ ధర రూ.19.95 లక్షలుగా (ఎక్స్ షోరూమ్) నిర్ణయించారు. వేరియంట్‌ను బట్టి గరిష్ఠ ధర రూ.29.45 లక్షల వరకు ఉంది. వచ్చే ఏడాది జనవరి 14 నుంచి దీని బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి.




జనవరి 23 నుంచి డెలివరీలు చేపట్టనున్నారు. మహీంద్రాకు చెందిన ఈవీ ఇంగ్లో ప్లాట్‌ఫామ్‌పై విడుదల చేసిన మూడో విద్యుత్ వాహనం ఇది. అంతకుముందు ఎక్స్‌ఈవీ 9ఈ, బీఈ 6ఈ పేరుతో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను మార్కెట్లోకి తీసుకొచ్చింది. తాజాగా విడుదల చేసిన ఎక్స్‌ఈవీ 9ఎస్ టెస్ట్ డ్రైవ్‌లు డిసెంబరు 5 నుంచి ప్రారంభం కానున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఎక్స్‌ఈవీ 9ఎస్ ఫీచర్లు ఇవే.. ఈ విద్యుత్ వాహనం 59kWh, 70kWh, 79kWh బ్యాటరీ ప్యాక్‌లను సపోర్ట్ చేస్తుంది. 175 కిలోవాట్ వరకు ఫాస్ట్ ఛార్జింగ్ సౌకర్యం ఉంది. వేరియంట్లను బట్టి ఒక ఛార్జింగ్‌కు 521679 కిలోమీటర్ల వరకు వెళ్లొచ్చు. 79 kWh బ్యాటరీ ప్యాక్‌ను ఒక్కసారి ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 679 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు. ఈ 7 సీటర్ ఎక్స్‌ఈవీలో 527 లీటర్ల బూట్‌స్పేస్ ఇచ్చారు. మూడో వరుసను ఫోల్డ్ చేసుకునే సదుపాయం ఉంది. డ్యాష్‌బోర్డుపై మూడు డిజిటల్ స్క్రీన్లు ఉన్నాయి.

# సినిమా

# నేనే ఫస్ట్ కొన్న



బుల్లి తెరపై ఎంట్రీ ఇచ్చి అక్కడ సక్సెస్ తర్వాత వెండి తెరకు ప్రమోట్ అయిన బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ . సీతారామం మూవీతో టాలీవుడ్‌లోనూ సంచలనంగా మారింది. ఎన్నో హేళనలు, అవమానాల తర్వాత ఈ స్థాయికి చేరుకుంది. ఇటీవలే లగ్జరీ మెర్సిడెజ్ బెంజ్ కారు కొనుగోలు చేసిన అమ్మడు తనకు జరిగిన ఓ అవమానం గురించి గుర్తు చేసుకుంది. తన చిన్న తనంలో తన తల్లిని చుట్టాలే కారు ఎక్కించుకోవాలంటే ఆలోచించేవారట. ఓసారి కారెక్కే అర్హత లేదని అవమానించారట. ఒంటరిగా ఆమెను వదిలేసి వెళ్లిపోయారట. ఆ ఘటన గుర్తొచ్చినప్పుడల్లా తానెంతో బాధపడుతానని చెప్పింది. దీంతో డబ్బు సంపాదించి ఖరీదైన కారులో అమ్మను తీసుకెళ్లాలని బలంగా డిసైడ్ అయిందట. ఆ కల ఇప్పటికి నెరవేరిందని సంతోషంగా చెప్పింది. తమ బంధువుల్లో ఎవరికీ బెంజ్ కారు లేదని.. తానే ఆ కారు కొన్న మొదటి వ్యక్తిగా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె డెకాయిట్ మూవీతో పాటు అల్లు అర్జున్ కొత్త మూవీలోనూ నటిస్తోంది. వీటితో పాటు మరికొన్ని కమిట్‌మెంట్లు కూడా ఉన్నాయి.

## తల్లిగా 10/10 మార్కులు



మంచు కుటుంబంలో వివాదం గురించి తెలిసిందే. తాజాగా దీనిపై మంచు లక్ష్మీ స్పందించింది. తన కుటుంబంలో వివాదాలు వస్తాయని ఎప్పుడూ అనుకోలేదని చెప్పింది. అన్ని కుటుంబాల్లోనూ గొడవలు ఉంటాయన్న ఆమె.. ఎన్ని వివాదాలు వచ్చినప్పటికీ చివరకు అందరూ ఒక్కటవ్వాలని పేర్కొంది. భారతీయ కుటుంబాల్లో కొన్ని సార్లు గొడవలైతే.. జీవితాంతం కలవకూడదని కొందరు అనుకుంటారని చెప్పింది. కానీ మనకు చివరకు మిగిలేది రక్తసంబంధీకులు మాత్రమేనని అందరూ గుర్తుంచుకోవాలంది. తాజాగా ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మంచు లక్ష్మీ ఒక తల్లిగా, సొదరిగా, కుమార్తెగా ఉన్నప్పటికీ అన్ని బాధ్యతల్లోకెల్లా తల్లిగా తనకు 10కి 10 మార్కులు వేసుకుంటానని తెలిపింది. ఫ్యామిలీతో కలిసి ఉండటానికి ఎన్ని పోరాటాలైనా చేయాలే తప్ప.. దూరాన్ని పెంచకూడదని చెప్పింది. తాను ముంబైలో ఉంటున్నందున ఇక్కడి విషయాల గురించి తెలిసినా బాధపడలేదని కొంత మంది వార్తలు రాశారని.. తాను అనుభవించిన బాధేమిటో తనకే తెలుసని చెప్పింది.

## ఎవరు ఫైనల్?





బలగం సినిమాతో సూపర్ హిట్ అందుకున్న వేణు యెల్దండి తన రెండో ప్రాజెక్టు ఎల్లమ్మ మూవీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ మొత్తం పూర్తి అయింది. ఇక సినిమా మొదలు పెట్టడమే తరువాయి అని అనుకుంటున్న టైమ్‌లో నటులపై జరుగుతున్న చర్చ ఇప్పటికీ సస్పెన్స్‌గానే ఉంది. ఈ మూవీని ముందు నానితో చేయాలనుకున్న వేణుకు అది సాధ్యం కాలేదు. ఆ తర్వాత నితిన్, శర్వానంద్‌తో పాటు బెల్లంకొండ శ్రీనివాస్ పేర్లు కూడా వినిపించాయి. మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ నటిస్తారని కూడా కొంత కాలంగా ప్రచారం జరుగుతుంది. హీరో పాత్రలో ఎవరు నటించినప్పటికీ హీరోయన్‌గా మాత్రం కీర్తి సురేశ్ ఫైనల్ అని అనుకున్నారు. అయితే తాను ఎల్లమ్మ ప్రాజెక్టులో నటించడం లేదని తాజాగా కీర్తి సురేశ్ చెప్పడంతో రెండేళ్ల క్రితమే మంచి కథ రాసుకున్న వేణు ఫిమేల్ లీడ్‌గా ఎవరికి చాన్స్ ఇస్తారనే ప్రచారం మరోసారి తెరపైకి వచ్చింది.

## ఆశ్చర్యపరుస్తున్న ‘ధురంధర్’ రన్‌టైమ్ .. ఎంతంటే!

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా నటిస్తోన్న చిత్రం ‘ధురంధర్’ . ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమా ఇప్పుడు బాలీవుడ్‌లో చర్చనీయాశంగా మారింది. దీనికి కారణం ఈ సినిమా రన్‌టైమ్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ కావడమే. డిసెంబర్ 5న ఈ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో దీని రన్‌టైమ్ గురించి సోషల్ మీడియాలో పలు వార్తలు వస్తున్నాయి. దీని రన్‌టైమ్ 3.32 గంటలు అని బాలీవుడ్ మీడియా పేర్కొంది. ఒకవేళ ఇదే నిజమైతే అత్యంత నిడివి ఉన్న భారతీయ చిత్రాల్లో ‘ధురంధర్’ ఒకటవుతుంది. ఇక ఈ సినిమా మేజర్ మోహిత్ శర్మ జీవితం ఆధారంగా తెరకెక్కిందంటూ వస్తోన్న వార్తలపై దర్శకుడు తాజాగా స్పష్టతనిచ్చారు. “ఇది ఎవరి బయోపిక్ కాదు. భవిష్యత్తులో మోహిత్ శర్మపై బయోపిక్ తీస్తే వారి కుటుంబసభ్యుల అనుమతి తీసుకొని అధికారికంగా ప్రకటిస్తాను. దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని ఎప్పటికీ మర్చిపోలేం. ఆ బయోపిక్‌ను గౌరవంగా రూపొందిస్తా. ‘ధురంధర్’లో ఆయన గురించి చూపించలేదు” అని స్పష్టంచేశారు.



## భారీ ధరకు ‘దృశ్యం3’ థియేట్రికల్ రైట్స్.. ఇప్పుడందరి ముందు ఒక్కటే ప్రశ్న..?




‘దృశ్యం3’ ప్రకటించినప్పటి నుంచి భారతీయ సినీ ప్రేక్షకుల్లో మెదిలే ప్రశ్న ఒక్కటే. అన్ని భాషల్లో కలిపి ఒకేసారి విడుదల చేస్తారా? మలయాళంలో ఇప్పటికే ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉండగా, ఇతర భాషలకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు. ఈ క్రమంలో చిత్ర నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ మూవీస్ ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్, డిజిటల్ రైట్స్‌ను విక్రయించింది. ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ, డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పనోరమా స్టూడియోస్ ‘దృశ్యం3’ విడుదల హక్కులను సొంతం చేసుకుంది. ఇందుకోసం రూ.160కోట్లు చెల్లించినట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ఎక్కువగా హిందీ సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేసే ఈ సంస్థ ‘దృశ్యం3’ హక్కులను దక్కించుకోవడంతో విడుదల విషయంలో కొంతవరకూ స్పష్టత వచ్చినట్లు అయింది. మలయాళంతో పాటు, హిందీలోనూ ఒకేసారి విడుదల చేసేందుకు అవకాశం ఉందని చిత్ర వర్గాలు భావిస్తున్నాయి.

**మలయాళంలో విడుదల ఆలస్యం..**

పనోరమా స్టూడియోస్ ఈ మూవీ హక్కులను సొంతం చేసుకోవడంతో మలయాళంలో ‘దృశ్యం3’ విడుదల కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉంది. హిందీలో ఈ మూవీ ఇంకా పట్టాలెక్కలేదు. త్వరలోనే షూటింగ్ మొదలయ్యే అవకాశం ఉంది. డిసెంబరులో ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లవచ్చని అంటున్నారు. దీనిపైనా స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు తెలుగులో వెంకటేశ్ ఈ మూవీ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన త్రివిక్రమ్‌తో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో పాటు, ‘దృశ్యం3’ చేయాల్సి ఉంటుంది. రెండు సినిమాలకు డేట్స్ అడ్జస్ట్ చేయాలి. మరి వెంకీ దేనికి ప్రాధాన్యమిస్తారో చూడాలి. ఇవన్నీ ఓ కొలిక్కి వచ్చేలోపు జీతూజోసెఫ్ మలయాళ వెర్షన్ షూటింగ్ పూర్తి చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఎందుకంటే ఆయన టేకింగ్ అంత వేగంగా ఉంటుంది. అక్కడ పూర్తి చేసి, వెంటనే తెలుగు మూవీ కోసం వస్తారేమో చూడాలి. మోహన్‌లాల్, జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో వచ్చిన ‘దృశ్యం’ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎంతటి ఘన విజయాన్ని నమోదు చేశాయో అందరికీ తెలిసిందే. ఈ ఫ్రాంఛైజీలో ఇప్పటికే రెండు చిత్రాలు వచ్చి అలరించగా ఇప్పుడు మూడో భాగం సిద్ధమవుతోంది. అనుకోకుండా జరిగిన ఓ హత్య చుట్టూ సాగే కుటుంబ కథ నేపథ్యంలో ‘దృశ్యం’ సినిమాలు తెరకెక్కాయి. ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద రూ.240 కోట్లకు పైగా వసూలు చేసిన విషయం తెలిసిందే.

## దశాబ్దం దాటినా.. అలాగే పిలుస్తున్నారు

: ధనుష్ మెమొరీస్



కొన్ని క్యారెక్టర్లు నటులకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తుంటాయి. అసలు పేరు కన్నా ఆయా పాత్రల పేర్లే సినీ ప్రియుల హృదయాల్లో చెరగని ముద్ర వేస్తుంటాయి. తన కెరీర్‌లో కుందన్ రోల్ అలాంటిదే అంటున్నారు ప్రముఖ నటుడు ధనుష్. ఆయన తొలి హిందీ సినిమా ‘రాంఝునా’లోని రోల్ అది. మరో హిందీ మూవీ ‘తేరే ఇష్క్ మే’ శుక్రవారం విడుదల కానున్న సందర్భంగా వారణాసి వెళ్లిన ఆయన నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఈ మేరకు పోస్టు పెట్టారు. తొలి సినిమా షూటింగ్ స్పాట్‌లో తాజాగా దిగిన ఫొటోలు పంచుకున్నారు. ఆయన వెంట దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ ఉన్నారు. “కుందన్‌గా నటించి దశాబ్దం దాటినా ఆ పాత్ర జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. వారణాసి వీధుల్లో ఆ పేరు ఇంకా మార్మోగుతూనే ఉంది. ఇక్కడ ప్రజలు నన్ను కుందన్ అని పిలుస్తుంటే.. ఆనందంగా ఉంది. వాళ్లు అలా పిలిచినప్పుడు చిరునవ్వే నా సమాధానం. అప్పుడు షూటింగ్ ప్రదేశాల్లోనే ఇప్పుడు నడుస్తున్నా” అని పేర్కొన్నారు. ‘తేరే ఇష్క్ మే’ దర్శకుడు ఆనంద్, హీరోయిన్ కృతిసనన్‌తో కలిసి ధనుష్ బుధవారమే వారణాసి చేరుకున్నారు. గంగా హారతికి హాజరయ్యారు. అనంతరం ధనుష్ మీడియాతో మాట్లాడుతూ.. “వారణాసి ప్రస్తావన లేకుండా ఆనంద్ సినిమాలు తెరకెక్కించరని అనుకుంటున్నా. ‘తేరే ఇష్క్ మే’ కథలోనూ వారణాసి ఓ భాగమైంది. ఈ ప్రాంతం నాకు ప్రత్యేకం” అని తెలిపారు. ‘రాంఝునా’తో హిట్ కాంబినేషన్‌గా నిలిచిన ధనుష్ ఆనంద్‌ల మూడో ప్రయత్నమిది. ఈ కాంబోలో రూపొందిన రెండో సినిమా ‘అత్రాంగి రే’.

# అనాథ విద్యార్థులకు సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థుల విరాళం

ఎల్బీనగర్, నవంబర్ 27 (భారత శక్తి): హబ్సిగూడలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల పదవ తరగతికి చెందిన వంద మంది విద్యార్థులు గురువారం ఎల్బీనగర్ లోని అనాథ విద్యార్థి గృహమును, వారి ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు.గృహములోని విద్యార్థులకు అన్ని రకాల స్టేషనరీ వస్తువులు,ఆయిల్ ప్యాకెట్లు,టీ పౌడర్, బాడీ లోషన్, పప్పులు, పల్లీలు మొదలగునవి గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ సమక్షంలో విరాళంగా ఇచ్చారు. విద్యార్థులతో వచ్చిన ఉపాధ్యాయులు రూ.ఐదు వేలు గృహ విద్యార్థుల అత్యవసర పుస్తకాలకు విరాళం ఇచ్చారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన గ్రంథాలయం, స్టడీ హాల్, లివింగ్ రూములు, డైనింగ్ హాల్,కంప్యూటర్ ల్యాబ్, ఆడిటోరియం, సోలార్ ఎనర్జీ ప్లాంట్, గార్డెన్స్ మొదలగునవి



చూసి చాలా ఆశ్చర్యానికి గురయ్యారు.గృహ విద్యార్థులు ఎలాంటి ఒక్క సిబ్బంది లేకుండా, అన్నిపనులు వారే చేసుకునే విధానం తెలుసుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్ జోసెఫ్ పాఠశాల ఉపాధ్యాయులు రిషిత, కార్తీక రేఖ, జయప్రద, ప్రణయ్ పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్లే పనుల్లో ఆలస్యం

**: కళ్లెం నవజీవన్ రెడ్డి**

ఎల్బీనగర్, నవంబర్ 27 (భారత శక్తి): హయత్‌నగర్ డివిజన్‌లోని పద్మావతి కాలనీలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజ్ ట్రంక్ లైన్ మరమ్మత్తు పనులను నేడు ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పనులు ఆలస్యమవడానికి కారణం పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమని, ప్రజలు రోజు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా, సమస్యలను సీరియస్‌గా తీసుకుని, అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని పనులను వేగవంతం పెంచాలని వారు తెలిపారు..ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, పద్మావతి కాలనీ అధ్యక్షులు అమర్నాథ్ గౌడ్ సంక్షేమ సంఘం సభ్యులు జగన్ మోహన్ రెడ్డి, చంద్ర శేఖర్, సురేష్ రెడ్డి,



అంజి రెడ్డి మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..



## బంజారాహిల్స్ డివిజన్ లో సుమారు 3 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీ కారం

**: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

హైదరాబాద్, నవంబర్ 27 (భారత శక్తి): బంజారాహిల్స్ డివిజన్ లో ఎన్బీటీ నగర్, వెంగల్ రావు బిడ్లింగ్, మిథిలా నగర్ లో 3 కోట్ల అభివృధి పనులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గురువారం శంకుస్థాపన చేశారు. డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి మేయర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తన క్యాంప్ కార్యాలయంలో జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరం, బంజారాహిల్స్ డివిజన్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం



అందిస్తుందని మేయర్ తెలిపారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన పనులతో పాటు ప్రగతి లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు.



## కోర్టు ప్రాంగణంలో లేడీ బార్ అసోసియేషన్ ప్రత్యేక ఛాంబర్ ప్రారంభం

* **ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన జిల్లా జడ్జి కర్ణ కుమార్**

ఎల్బీనగర్, నవంబర్ 27 (భారత శక్తి): హయత్ నగర్ కోర్టు ప్రాంగణంలో మహిళా న్యాయవాదుల సౌలభ్యం కొరకు ప్రత్యేకమైన ఛాంబర్ ఉండాలని బార్ అసోసియేషన్ నిర్ణయించి నిధులు సమీకరించి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా గౌరవ ప్రిన్సిపాల్ జడ్జి కర్ణ కుమార్ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ కోర్టు ప్రిన్సిపాల్ జడ్జి శ్రీమతి సల్మా ఫాతిమా, అడిషనల్ జడ్జి శ్రీమతి ఫర్వీనా బేగం,ఇంకా బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్ట్ సిబ్బంది, న్యాయవాదులు, హయత్నగర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాల వేళ.. మూగజీవాలకు రక్షణ కల్పిద్దాం

* **విధివిధానాలు రూపొందిద్దామన్న మంత్రి శ్రీహరి**

హైదరాబాద్, నవంబర్ 27 (భారత శక్తి) : ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మూగజీవాలకు రక్షణ కల్పించాల్సినవసరం ఉందని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానలు రూపొందించడానికి సచివాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. తర్వాత క్యాబినెట్లో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మూగజీవాలకు రక్షణ కల్పించడంపై గురువారం జరిగిన సదస్సులో మంత్రి శ్రీహరి మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలను పసిగట్టడంలో మనకంటే మూగజీవాలు ముందున్నప్పటికీ.. వాటికి కనీస రక్షణ ఏర్పాట్లు లేక ప్రమాదంలో పడుతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో వాటి రక్షణకు స్పష్టమైన విధానాలను రూపొందించాల్సినవసరం ఎంతైనా ఉందన్నారు. పక్రృతిని వికృతంగా వాడుకుంటున్నందున వైపరీత్యాలు సహజంగా మారాయని మంత్రి చెప్పారు. భారీ వర్షాలు, విపరీతమైన ఎండలకు మనమే తట్టుకోలేకపోతున్నాం.. అలాంటిది మూగ జీవాలు ఎలా అని ఆలోచించడం చాలా మంచి పరిణామం అని అన్నారు. రాష్ట్రంలో గోవుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని.. తెలంగాణ గో సంరక్షణ్ పేరిట విధివిధానాలను రూపొందించామని గుర్తు చేశారు.



### మూగజీవాల రక్షణ గురించీ ఆలోచిద్దాం..

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రిహాబిలిటేషన్ కేంద్రాలను ప్రజలను తరలించడం, వారికి రక్షణ కల్పించడం తరచూ జరుగుతోంది. మూగ జీవాల విషయంలోనూ ఆలోచన చేయాల్సినవసరం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవిందుకుమార్, హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇప్పటివరకూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల విషయంలోనే ఎక్కువ శ్రద్ధ తీసుకోవడం జరిగిందన్నారు. మూగజీవాలకు కూడా షెల్టర్ జోన్లను ఏర్పాటు చేసి రక్షణ కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల ఒక్క రోజులోనే 10 సెంటీ మీటర్ల నుంచి 20 సెంటీమీటర్ల మేర వర్షం పడుతోందని.. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో మూగ జీవాల గురించి ప్రత్యేక చర్యలవసరమన్నారు. వర్షాల గురించి ముందస్తు సమాచార వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. దీనిని మరింత అభివృద్ధి చేయాల్సినవసరం ఉందన్నారు. వరదలను అరికట్టడానికే చెరువుల పరిరక్షణ పెద్దయెత్తున జరుగుతోందదన్నారు. ఆ దిశగా హైడ్రా పని చేస్తోందని.. నగరంలో నాలాల విస్తరణతో ప్యాట్నీ, అమీర్పేట పరిసరాలు మునగకుండా జాగ్రత్త పడ్డామన్నారు. నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురి కాకుండా వాటిని పరిరక్షిస్తే చాలా వరకు వరదలు నివారించవచ్చునని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ శ్రీ బి. గోపి గారు, కేరళ రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం మెంబర్ సెక్రటరీ డా. సేఖర్ ఎల్ కురాయ్కోస్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియల కొరకు సహకారం అందించిన సురక్ష సేవా సంఘం


అబ్దుల్లాపూర్ మెట్, నవంబర్ 27 (భారత శక్తి): అబ్దుల్లాపూర్ మెట్ మండలం బాట సింగారం గ్రామం సింగరేణి కాలనీలో గత 25 సంవత్సరాలుగా కిరాయికి ఉండి కూలి పనులు చేసుకుంటూ మంచానికి పరిమితమైన తన భర్తను (83) చూసుకుంటూ బతుకు వెళ్లదీస్తున్న పార్వతమ్మకు తనకంటూ ఎవరూ లేరు. గురువారం ఉదయం 5 గంటలకు భర్త మరణించగా ఏం చేయాలో తెలియక ఆ వృద్ధురాలు దిక్కు తోచని స్థితిలో సహాయం కోసం ఎదురు చూస్తుండగా, సురక్ష సభ్యుడు శివ గౌడ్ ఇచ్చిన సమాచారం మేరకు సురక్ష సేవా సంఘం గ్రూపు సభ్యుల నుండి విరాళాలు సేకరించి వృద్ధుని అంత్యక్రియలకు 10



వేల రూపాయలు అందించారు.ఈ కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్, క్రియా శీలక సభ్యులు యాకుబ్, శివ గౌడ్, రంగారెడ్డి, రమేష్, నారాయణ పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. కేసీఆర్ ఓఎస్డీని విచారించిన సిట్


హైదరాబాద్, నవంబర్ 27 (భారత శక్తి): తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న సిట్ మళ్లీ విచారణ ప్రారంభించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్‌రెడ్డిని పోలీసులు విచారించారు. జూబ్లీహిల్స్ పీఎస్‌లో అతడిని రెండు గంటల పాటు ప్రశ్నించారు. ఇటీవల



హైదరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టిన సజ్జనార్.. ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసు విచారణ ఏ దశలో ఉంది? ఇప్పటి వరకు దాఖలు చేసిన ఛార్జ్ షీట్లు తదితర అంశాలపై ఆరా తీశారు. కేసు విచారణపై దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్ ఓఎస్డీని విచారించినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు, నిందితులను ఇప్పటికే పలువిడతలుగా సిట్ విచారించింది. నలుగురు పోలీసు అధికారులను కూడా సస్పెండ్ చేసింది. ఈ కేసులో కీలక నిందితుడు రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్టులో 'భారత రాష్ట్రసమితి సుప్రీం' అనే పదాన్ని వాడారు. అంటే, కేసీఆర్ ఆదేశాల మేరకే తాము ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు అప్పట్లో రాధాకిషన్‌రావు చెప్పినట్లు రిమాండ్ రిపోర్టులో ఉంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌కు ఓఎస్డీగా పని చేసిన రాజశేఖర్‌రెడ్డిని విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది.

## 2015 గ్రూప్2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, నవంబర్ 27 (భారత శక్తి) : తెలంగాణలో 2015 గ్రూప్ 2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్2పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ బెంచ్ తీర్పును టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయగా.. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. 201516 గ్రూప్2ను రద్దు చేస్తూ ఇటీవల హైకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. నాటి ఎంపిక జాబితాను కొట్టివేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా డబుల్ బబ్లింగ్, వైట్‌నర్ వినియోగం, తుడిపివేతలున్న పార్ట్ బి పత్రాలను పునర్ మూల్యాంకనం చేయడం చెల్లదని పేర్కొంది. హైకోర్టు తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా వ్యవహరించే అధికారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు లేదని తేల్చి చెప్పింది. జవాబు పత్రాల్లో ట్యాంపరింగ్ జరిగిందని స్పష్టంగా కనిపిస్తున్నపుడు వాటిని పక్కన పెట్టకపోవడం కమిషన్ వైఫల్యమేనని తేల్చి చెప్పింది. 2019 అక్టోబరు 24న ఇచ్చిన ఫలితాలు



ఏకపక్షమని, చట్టవిరుద్ధమని వాటిని రద్దు చేసింది. సాంకేతిక కమిటీ సిఫార్సులు, హైకోర్టు తీర్పునకు అనుగుణంగా తిరిగి మూల్యాంకనం నిర్వహించి అర్హుల జాబితాను విడుదల చేసి నియామకాలు చేపట్టాలని, ఈ ప్రక్రియను 8 వారాల్లో పూర్తి చేయాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది.

# హసీనా అప్పగింతపై భారత్ కీలక ప్రకటన.. అభ్యర్థన పరిశీలనలో ఉందన్న ప్రభుత్వం

ఢిల్లీ, నవంబర్ 27 (భారత శక్తి): బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలంటూ ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం చేసిన అభ్యర్థన అందిందని, దానిని పరిశీలిస్తున్నామని భారత్ బుధవారం అధికారికంగా వెల్లడించింది. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు, ఆ దేశంలో శాంతి, ప్రజాస్వామ్య స్థాపనకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది. గతేడాది విద్యార్థుల నేతృత్వంలో జరిగిన నిరసనలను అణచివేసినందుకు గానూ 'మానవతా వ్యతిరేక నేరాల' కింద ఢాకాలోని ప్రత్యేక ట్రైబ్యునల్ ఇటీవల 78 ఏళ్ల షేక్ హసీనాకు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఆమెతో పాటు మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌కు కూడా ఇదే అభియోగాలపై మరణశిక్ష పడింది. గతేడాది ఆగస్టు 5న భారీ ఆందోళనల నడుమ బంగ్లాదేశ్ నుంచి పారిపోయి వచ్చిన హసీనా, అప్పటి నుంచి భారత్‌లోనే నివసిస్తున్నారు. ఈ తీర్పు నేపథ్యంలో హసీనాను తమకు అప్పగించాలని కోరుతూ బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత్‌కు లేఖ రాసింది. దీనిపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. "ఈ అభ్యర్థనను ప్రస్తుత న్యాయ, అంతర్గత చట్టపరమైన ప్రక్రియల ప్రకారం పరిశీలిస్తున్నాం" అని తెలిపారు. రెండు దేశాల మధ్య ఉన్న అప్పగింత ఒప్పందం ప్రకారం హసీనాను వెంటనే అప్పగించడం భారత్ విధి అని బంగ్లాదేశ్ పేర్కొంది. అయితే ఈ తీర్పును షేక్ హసీనా తీవ్రంగా ఖండించారు. "ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కాని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కీలుబొమ్మ ట్రైబ్యునల్ ఈ తీర్పు ఇచ్చింది" అని ఆమె ఆరోపించారు. మరోవైపు, హసీనాకు మరణశిక్ష విధించిన విచారణ ప్రక్రియలో రాజ్యాంగ విరుద్ధంగా న్యాయమూర్తుల నియామకం సహా అనేక లోపాలు ఉన్నాయని భారత ప్రాథమిక అంచనాలో తేలినట్లు సమాచారం. బంగ్లాదేశ్‌లో పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని భారత్ పేర్కొంది.

## హాంకాంగ్ అగ్నిప్రమాదం...

హాంకాంగ్, నవంబర్ 27: హాంగ్‌కాంగ్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. వాంగ్ ఫుక్ కోర్టు రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో చెలరేగిన మంటల్లో మృతుల సంఖ్య 65కి చేరింది. మృతుల్లో ఒక అగ్నిమాపక సిబ్బంది కూడా ఉన్నారు. మరో 70 మందికి పైగా గాయపడ్డారు. అయితే ఈ పెను విషాదం మధ్య ఓ అద్భుతం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన 24 గంటల తర్వాత ఒక వ్యక్తిని సహాయక సిబ్బంది ప్రాణాలతో కాపాడారు. గురువారం మధ్యాహ్నం 32 అంతస్తుల ఈ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో మంటలు చెలరేగాయి. నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన వెదురు పరంజాలు, ప్రతి అంతస్తులో అమర్చిన అత్యంత సులభంగా మండే ఫోమ్ బోర్డుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించాయి. దీన్ని అధికారులు తీవ్రమైన నిర్లక్ష్యంగా పరిగణిస్తున్నారు. గత 50 ఏళ్లలో హాంగ్‌కాంగ్‌లో ఇదే అత్యంత తీవ్రమైన భవన ప్రమాదం కావడం గమనార్హం. సుమారు 1,200 మంది అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. భవనం కూలిపోతుందనే భయం, తీవ్రమైన వేడి, కూలిపోయిన పరంజాలు వంటి సవాళ్ల మధ్య వారు ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశారు. ఈ క్రమంలోనే నిన్న సాయంత్రం 16వ అంతస్తులో చిక్కుకుపోయిన వ్యక్తిని 24 గంటల తర్వాత ప్రాణాలతో బయటకు తీశారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది. ఇంకా 24 మందికి పైగా గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. చాలా మంది నివాసితులు తమ ఫ్లాట్‌లలో అలారమ్‌లు మోగలేదని, మంటలను చూశాకే బయటకు పరుగులు తీశామని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి నిర్మాణ కంపెనీకి చెందిన ఇద్దరు డైరెక్టర్లు, ఒక కన్సల్టెంట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం ప్రమాద కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

### ప్రపంచానికే ఆదర్శం మన యువత..

## వారి వల్లే స్టార్టప్ విప్లవం సాధ్యమైంది

ఢిల్లీ, నవంబర్ 27 (భారత శక్తి): భారత యువత, ముఖ్యంగా జెన్‌జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్I'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్‌జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు. గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్‌టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

## డెంగీకి సింగిల్ డోస్ వ్యాక్సిన్.. ప్రపంచంలోనే తొలిసారి!

ఢిల్లీ, నవంబర్ 27 (భారత శక్తి): డెంగీ నివారణలో ప్రపంచం ఒక చారిత్రక ముందడుగు వేసింది. ప్రపంచంలోనే తొలి సింగిల్ డోస్ డెంగీ వ్యాక్సిన్‌కు బ్రెజిల్ ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలిపింది. వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా డెంగీ కేసులు రికార్డు స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. సావో పాలోలోని ప్రఖ్యాత బుటాంటన్ ఇనిస్టిట్యూట్ అభివృద్ధి చేసిన 'బుటాంటన్‌డీవీ' అనే ఈ వ్యాక్సిన్‌ను 12 నుంచి 59 ఏళ్ల వయసు వారికి అందించనున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డెంగీ వ్యాక్సిన్‌ను మూడు నెలల వ్యవధిలో రెండు డోసులుగా తీసుకోవాల్సి ఉండగా, ఈ కొత్త వ్యాక్సిన్ ఒక్క డోసుతోనే సరిపోతుంది. ఇది వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగంగా, సులభంగా మార్చనుంది. "బ్రెజిల్ సైన్స్, ఆరోగ్య రంగాలకు ఇది ఒక చారిత్రక విజయం. దశాబ్దాలుగా మనల్ని పీడిస్తున్న వ్యాధిపై పోరాటానికి ఇది ఒక శక్తిమంతమైన ఆయుధం" అని బుటాంటన్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ఎస్పర్ కల్లాస్ మీడియా సమావేశంలో తెలిపారు. బ్రెజిల్‌లో 16,000 మంది వలంటీర్లపై ఎనిమిదేళ్ల పాటు నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో ఈ వ్యాక్సిన్ తీవ్రమైన డెంగీపై 91.6 శాతం సమర్థత చూపింది. మనిషిని కుదురు లేకుండా చేసే ఈ వ్యాధి లక్షణాల కారణంగా 'బ్రేక్‌బోన్ ఫీవర్' అని కూడా డెంగీని పిలుస్తారు. ఇది కొన్ని సందర్భాలలో అంతర్గత రక్తస్రావానికి కారణమై ప్రాణాంతకంగా కూడా మారుతుంది. 2024లో ప్రపంచవ్యాప్తంగా 1.46 కోట్ల కేసులు, 12,000 మరణాలు నమోదయ్యాయని, వీటిలో సగం మరణాలు బ్రెజిల్‌లోనే సంభవించాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. 2026 ద్వితీయార్థంలో సుమారు 30 మిలియన్ల డోసుల వ్యాక్సిన్‌ను అందించేందుకు చైనాకు చెందిన వుసీ బయోలాజిక్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు బ్రెజిల్ ఆరోగ్య మంత్రి తెలిపారు.

## ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు: జైలు అధికారుల వెల్లడి

పాకిస్థాన్ నవంబర్ 27 (భారత శక్తి): పాకిస్థాన్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ జైల్లో మరణించారంటూ సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులపై రావల్పిండిలోని అడియాలా జైలు అధికారులు స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని గురువారం స్పష్టం చేశారు. ఆయన్ను జైలు నుంచి ఎక్కడికీ తరలించలేదని, ప్రస్తుతం తమ వద్దే ఉన్నారని తెలిపారు. జైలు అధికారులు విడుదల చేసిన ప్రకటనలో, "ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలు నుంచి తరలించారనే కథనాల్లో వాస్తవం లేదు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు, అవసరమైన పూర్తి వైద్య సంరక్షణ అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యంపై వస్తున్న పుకార్లను నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఈ వదంతులపై ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్‌ఎఇన్సాఫ్ (పీటీఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని, ఇమ్రాన్‌తో ఆయన కుటుంబ సభ్యుల భేటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. గత కొన్ని వారాలుగా ఇమ్రాన్ సోదరీమణులను ఆయన్ను కలిసేందుకు అనుమతించకపోవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. తమ సోదరుడిని కలిసేందుకు అనుమతించకపోవడంతో ఇమ్రాన్ సోదరీమణులు అలీమా ఖాన్, నూరీన్ ఖాన్, ఉజ్మా ఖాన్ మంగళవారం అడియాలా జైలు బయట గంటల తరబడి నిరసన చేపట్టారు. "లోపల ఏం జరుగుతోందో ఎవరికి తెలుసు? బహుశా ఇమ్రాన్‌ను వేరే చోటుకు తరలించి ఉండవచ్చు. అందుకే మమ్మల్ని కలవనివ్వడం లేదు" అని అలీమా ఖాన్ అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో అరాచక పాలన నడుస్తోందని ఆమె విమర్శించారు. 2022లో అవిశ్వాస తీర్మానంతో అధికారం కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్, అవినీతి, ఉగ్రవాదం వంటి పలు కేసుల్లో 2023 ఆగస్టు నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే.

## ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే

ఢిల్లీ, నవంబర్ 27 (భారత శక్తి): సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు తప్పనిసరిగా బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సొంతంగా ఛానల్ ప్రారంభించినంత మాత్రాన ఎవరికీ జవాబుదారీగా ఉండననుకోవడం సరికాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియాకు సంబంధించిన ఓ వివాదంపై గురువారం విచారణ సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై అభ్యంతరకర ప్రశ్నలు అడిగిన ఘటనలో రణ్‌వీర్ వివాదాస్పదుడయ్యారు. ఈ కేసు విచారణకు రాగా, ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. "అసభ్యకరమైన కంటెంట్ అప్‌లోడ్ చేస్తే అది వైరల్ అవుతుంది, లక్షల మంది చూస్తారు. దీన్ని ఎలా నియంత్రిస్తారు? దేశ వ్యతిరేక కంటెంట్ పెట్టినప్పుడు దానికి సదరు క్రియేటర్ బాధ్యత వహిస్తారా?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశం కాదని, యూజర్లు సృష్టించే కంటెంట్‌లోని లోపాలను ఇది ఎత్తిచూపుతోందని అన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను వక్రీకరించకూడదని ఆయన పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, ఆన్‌లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పటికీ ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయని కేంద్రాన్ని నిలదీసింది. సోషల్ మీడియాలో వినియోగదారులు సృష్టించే కంటెంట్‌ను నియంత్రించేందుకు సరైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు కేంద్రానికి నాలుగు వారాల సమయం

## సెకండ్ హ్యాండ్ కార్లకు పెరుగుతున్న గిరాకీ...

ఢిల్లీ, నవంబర్ 27 (భారత శక్తి): భారతదేశంలో సెకండ్ హ్యాండ్ (యూజ్డ్) కార్ల మార్కెట్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు అసంఘటిత రంగంగా ఉన్న ఈ మార్కెట్, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల రాకతో కొత్త రూపు సంతరించుకుంది. సరసమైన ధరలు, ఆన్‌లైన్ సౌలభ్యం, పారదర్శకత, సులభమైన ఫైనాన్స్ వంటి కారణాలతో కొనుగోలుదారులు కొత్త వాహనాలకు బదులుగా నాణ్యమైన సెకండ్ హ్యాండ్ కార్ల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. గణాంకాల ప్రకారం, 2024 నాటికి 36 నుంచి 45 బిలియన్ డాలర్ల విలువైన భారత యూజ్డ్ కార్ల మార్కెట్, 2030 నాటికి 73 నుంచి 101 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఏటా 10 నుంచి 15 శాతం వృద్ధితో ఈ రంగం కొత్త కార్ల అమ్మకాలను అధిగమిస్తుండటం గమనార్హం. కొత్త కార్ల ధరలు పన్నులు, ఉద్గార నిబంధనల కారణంగా పెరుగుతుండటంతో, మొదటిసారి కారు కొంటున్నవారు, యువ ఉద్యోగులు, ద్విచక్ర వాహనాల నుంచి అప్‌గ్రేడ్ అవ్వాలనుకునే వారికి యూజ్డ్ కార్లు ఆకర్షణీయమైన ఎంపికగా మారాయి. ఈ మార్పులో కార్స్24 (Cars24) వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గతంలో సెకండ్ హ్యాండ్ కారు కొనాలంటే ధరల విషయంలో అస్పష్టత, వాహన చరిత్ర తెలియకపోవడం, డాక్యుమెంటేషన్ సమస్యలు ఉండేవి. కానీ ఇప్పుడు డిజిటల్ వేదికలు ప్రతి కారుకు 300పాయింట్ల నాణ్యత తనిఖీలు, పూర్తి సర్వీస్ రికార్డులు, పారదర్శకమైన ధరలు, వారంటీ, 30 రోజుల రిటర్న్ పాలసీ వంటి సదుపాయాలు అందిస్తూ వినియోగదారుల్లో నమ్మకాన్ని పెంచుతున్నాయి.

మార్కెట్ ట్రెండ్స్ పరిశీలిస్తే, 25 నుంచి 45 ఏళ్ల వయసు వారే 80 శాతం కొనుగోలుదారులుగా ఉన్నారు. వీరిలో 60 శాతం మంది మొదటిసారి కారు కొంటున్నవారే. వాహనాల పరంగా హ్యాచ్‌బ్యాక్‌లు 53 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, ఎస్‌యూవీల విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయి. మారుతి సుజుకి, హ్యుండాయ్ బ్రాండ్లకు ఆదరణ కొనసాగుతుండగా, టాటా, కియా వంటి సంస్థల కార్లకు కూడా డిమాండ్ పెరుగుతోంది. సాంకేతికత ఆధారిత సేవలతో యూజ్డ్ కార్ల రంగం మరింత వ్యవస్థీకృతంగా మారుతూ, లక్షలాది మంది భారతీయుల

## శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులు..

తిరుమల, నవంబర్ 27 (భారత శక్తి): ప్రపంచం నలుచెరగులా తిరుమల శ్రీవారి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా కార్యక్రమాలు చేపట్టాలని, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్యాత్మికత, అన్నదానం, విద్య, వైద్యానికి చిరునామాగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గురువారం సచివాలయంలో దేవాదాయశాఖ, టీటీడీపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తిరుమల ఆలయంలో పాటిస్తున్న అత్యుత్తమ విధానాలను రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రసాదాల తయారీ, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాల్లో తిరుమల ప్రమాణాలను అనుసరించాలని సూచించారు. ప్రసాదాల తయారీకి సేంద్రియ ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని, భక్తుల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వాడుకోవాలని ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యం కావాలని, టీటీడీ భక్తుల పోర్టల్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు.

### టీటీడీ ఆసుపత్రులు ఆదర్శంగా నిలవాలి

తిరుపతిలోని స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రులను అనుసంధానం చేసి, వాటిని ఒక మోడల్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పుట్టపర్తి శ్రీ సత్యసాయి ఆస్పత్రుల తరహాలో అత్యుత్తమ నిర్వహణ ప్రమాణాలతో వీటిని తీర్చిదిద్దాలని సూచించారు. దేశంలోని ప్రముఖ వైద్య నిపుణులను 'శ్రీవారి సేవకులు'గా ఆహ్వానించి, వారి సేవలను ఈ ఆసుపత్రుల ద్వారా భక్తులకు, ప్రజలకు అందించేలా అవకాశం కల్పించాలన్నారు. మందులను నేరుగా తయారీదారుల నుంచే కొనుగోలు చేయాలని, అత్యవసర సమయాల్లో క్యూలైన్లలోని భక్తులను తక్షణమే ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. భక్తులకు సులభంగా సమాచారం అందించేందుకు అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు.

### వైకుంఠ ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు

రాబోయే వైకుంఠ ఏకాదశికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎం టీటీడీ అధికారులను ఆదేశించారు. భక్తులు అన్ని భాషల్లోనూ దర్శనానికి రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం కల్పించాలని, వీలైనంత ఎక్కువ మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. టీటీడీ ఆధ్వర్యంలోని అన్ని దేవాలయాల్లో నిత్యాన్నదానం జరిగేలా చూడాలన్నారు. తిరుమల కొండలపై జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, దివ్య ఔషధవనం ఏర్పాటుతో పాటు వివిధ రకాల పుష్పజాతుల మొక్కలను నాటాలని పేర్కొన్నారు.

### * ఆలయాల నిర్మాణం, జీర్ణోద్ధరణపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నిర్మించ తలపెట్టిన 5,000 దేవాలయాల డిజైన్లను మార్చి, వాటిలో ఆధ్యాత్మికత, ప్రశాంతత ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నిర్మాణాలను టీటీడీ పాలకమండలి సభ్యులతో కూడిన కమిటీ పర్యవేక్షించాలని సూచించారు. కొత్త ఆలయాలతో పాటు రాష్ట్రంలోని పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం దేశంలోని వివిధ ప్రాంతాల్లో టీటీడీ ఆలయాల నిర్మాణం జరుగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. అసోంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి 10 ఎకరాలు కేటాయించారని తెలుపగా, మరింత స్థలం కోసం తాను స్వయంగా మాట్లాడతానని సీఎం బదులిచ్చారు. దేశ, విదేశాల్లో నిర్మించే ప్రతి ఆలయం తిరుమల ప్రధాన ఆలయంతో అనుసంధానమై ఉండాలన్నారు. శ్రీవారి ఆస్తులు, ధనానికి పూర్తి జవాబుదారీతనం ఉండాలని, ఎక్కడా దుర్వినియోగానికి తావివ్వకుండా పారదర్శకంగా వ్యవహరించాలని గట్టిగా సూచించారు. ఒంటిమిట్ట రామాలయానికి భక్తుల సంఖ్య పెరిగేలా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. సామాన్య భక్తులకు దర్శన సమయం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం నిమిషానికి 8 మంది దర్శనం చేసుకుంటున్నారని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

# మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి : రాచకొండ సిపి జి.సుధీర్ బాబు

* **పదిహేను రోజుల్లో 110 మంది పోకిరీలను పట్టుకున్న షీ టీమ్స్**

ఎల్బీనగర్, నవంబర్ 27 (భారత శక్తి): మహిళలను వేధించే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో రాచకొండ షి టీమ్ సభ్యులు మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. బాలికలను, మహిళలను వెంబడించి వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా న్యాయస్థానంలో హాజరు పరుస్తూ, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నామని ఆయన అన్నారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు గురువారం రాచకొండ క్యాంప్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.అందులో భాగంగా రాచకొండ కమిషనరేట్ పరిదిలో మహిళలను వేధింపులకు గురిచేస్తున్న 110 (మేజర్స్74, మైనర్స్36 ) మందిని ఎల్బీనగర్ ఉమెన్ సేఫ్టీ ఆఫీసులో, కౌన్సిలర్స్ తో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ నెల తేదీ 1 నుండి 15 వ తేదీ వరకు 135 పిర్యాదులు అందాయి. ఫోన్ల ద్వారా వేధించిన కేసులు 34, సోషల్ మీడియా ద్వారా వేధించిన కేసులు 48, నేరుగా వేధించినవి 53 ఫిర్యాదులు అందాయని విమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి టి. ఉషారాణి తెలిపారు.

**అందులో ముఖ్యమైన కేసులు కొన్ని..**

ప్రయాణికులపై దాడి చేసిన ఉబర్ ఆటో డ్రైవర్ పై క్రిమినల్ కేసు నమోదు, సోషల్ మీడియాలో వేధిస్తున్న ఒకరినీ అరెస్టు చేశారు. వేరే ఫోన్ నంబర్ల నుంచి కాల్స్ చేస్తూ యువతిని వేధించిన వ్యక్తిని అరెస్టు చేశారు.తుక్కుగూడ పార్కులో




అల్లరి చేస్తున్నారని సమాచారం రావడంతో వెంటనే స్పందించిన షీ టీమ్ మహేశ్వరం అక్కడికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకొని అతనిపై కేసు నమోదు చేయడం జరిగింది.

మొత్తం 49 అవగాహన కార్యక్రమాలు

ఈ నెల 1 నుండి 15వ తేదీ వరకు షీ టీమ్స్ రాచకొండ మొత్తం 49 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, దాదాపు 7481 మందికి మహిళా చట్టాలు, వారి యొక్క హక్కులు, నేరాలు మరియు జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించడం జరిగింది.

**మెట్రో-రైల్ డెకాయ్ఆపరేషన్స్**

రాచకొండ షీ టీమ్స్ మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్సు నిర్వహించి, మహిళా కంపార్ట్మెంట్ లోకి వెళ్ళి ప్రయాణిస్తున్న (8) మంది పురుషులను పట్టుకుని మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా ఫైన్ వేయించడం జరిగింది. మహిళలు వేదింపులకు గురి అయినప్పుడు వెంటనే షీ టీమ్స్ ని, రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111 ద్వారా లేదా ఆ ప్రాంత షీ టీమ్ అధికారుల నంబర్లుభోనగిరి ఏరియా 8712662598చౌటుప్పల్ ఏరియా 8712662599 ఇబ్రహీంపట్నం ఏరియా 8712662600 కుషాయిగూడ ఏరియా 8712662601 ఎల్బీనగర్ ఏరియా 8712662602 మహేశ్వరం ఏరియా 8712665299 మల్కాజ్గిరి ఏరియా 8712662603 వనస్థలిపురం ఏరియా 8712662604 యాదాద్రి ఏరియా 8712665300 లకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని డీసీపీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిసిపి టి. ఉషా రాణి, ఏసీపీ పల్లె వెంకటేశ్వర్లు ఇన్స్ పెక్టర్లు ఎం. ముని, జి. అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.



## ఎల్బీనగర్ లో కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యాన నిరసన


* **కుండే వెంకటేష్, కురుమ యువ చైతన్య సమితి అధ్యక్షులు**

ఎల్బీనగర్ (భారత శక్తి) : కొమురవెల్లి మల్లన్న దేవస్థానం చైర్మన్ పదవి అగ్ర కులస్తులకు ఇవ్వడంపై తెలంగాణ కురుమ యువ చైతన్య సమితి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ శ్రీకాంత్ చారి విగ్రహం వద్ద కురుమ కులస్తులు ఆందోళనకు దిగారు. కురుమల ఆరాధ్య దైవమైన కొమురవెల్లి మల్లన్న స్వామి చైర్మన్ పదవి కురుమలకు ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ధర్నాలు రాస్తారోకోలు చేపడతామని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు కుండే వెంకటేష్ కురుమ ఈ సందర్భంగా అన్నారు కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోరిగె నర్సింహా, కాల్నే మల్లేష్ రావుల ఐలయ్య కురుమ కోడూరు అశోక్ కురుమ బిక్షం కురుమ మల్లేష్ కురుమ కేమెడీ ఉపేందర్ కురుమ బాలం శ్రీనివాస్ కురుమ కడగంచి నరసింహస్వామి కురుమ మల్లేశం కురుమ మంగ వెంకటేష్ కుర్మా రావుల ఐలయ్య కురుమ కాలే మల్లేష్ కురుమ దందె నరసింహ కురుమ మందుల వెంకటేష్ కురుమ గొరిగి మనోజ్ కురుమ తదితరులు పాల్గొన్నారు.



నాదర్ గుల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ కమిటి సభ్యులు కీ.శే. ఎలకొండ భోజీరెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, సుభాన్ యాదవ్, నాయకులు మాజీ ఎంపీటీసీ కందడి శ్రీరామ్ రెడ్డి, ఎలకొండ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడంగ్ పేట్, నవంబర్ 27 (భారత శక్తి ):



కొంపల్లిలోని ఎంఎస్ఆర్ కన్వేషన్ గార్డెన్స్ లో తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది సురేఖ కరుణాకర్ రెడ్డి కుమారుడి వివాహ నిశితార్థ వేడుకలో పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ డా. రంజిత్ రెడ్డి తదితరులు.

బడంగ్ పేట్, నవంబర్ 27 (భారత శక్తి ):

## నల్లచెరువులో ఆక్రమణలను హైడ్రా తొలగించలేదు

* **180 సర్వే నంబరుతో 176లో కబ్జాకు ప్రయత్నాలు**
* **స్వయంగా ఖాళీ చేసి వెళ్లిపోయిన చెత్త సేకరణదారులు**


హైదరాబాద్, నవంబర్ 27 (భారత శక్తి): కూకట్‌పల్లి నల్లచెరువు చెంత ఎలాంటి ఆక్రమణలను బుధవారం హైడ్రా తొలగించలేదు. చెరువు ఫుల్ ట్యాంక్ పరిధిలోకి వచ్చిన సర్వే నంబరు 176లో ఉన్న తాత్కాలిక షెడ్డులను హైడ్రా ఇప్పటికే ఖాళీ చేయించింది. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించిన ఆటోవాలాలు, స్క్రాప్‌ను వేరు చేసి అమ్ముకునేవారు తాత్కాలికంగా ప్లాస్టిక్ కవర్లతో వేసిన షెడ్డులను హైడ్రా ఇప్పటికే తొలగించింది. చెరువు పరిధిలోకి వస్తున్నారు.. ఖాళీ చేయాలని వారిని కోరగానే.. అక్కడివారు సమ్మతించి వెళ్లిపోయారు. ఇదంతా కూకట్‌పల్లి నల్లచెరువు ఫుల్ ట్యాంకు పరిధిలోకి వచ్చే సర్వే నంబరు 176 వ్యవహారం. చెత్తను సేకరించినవారితో పాటు. స్క్రాప్ అమ్ముకునే వారి నుంచి అద్దెలు కూడా తీసుకుని.. వారిని అడ్డం పెట్టుకుని ఆ స్థలాన్ని కొట్టేయాలనుకునేవారు సర్వే నంబరు 180తో ఇప్పుడు అక్కడ పేదల గుడిసెలు అని హైడ్రామా సృష్టిస్తున్నారు. అక్కడ తాత్కాలిక షెడ్డులు వేసుకున్న వారు స్వయంగా ఖాళీ చేసుకుని వెళ్లిపోగా.. కొంతమందితో కలిసి కబ్జాదారులు చివరి ప్రయత్నం చేస్తున్నారు.180 సర్వే నంబరుతో నష్టపరిహారం కావాలని కూడా కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. హైడ్రా ఖాళీ చేయిస్తున్నది 176 సర్వే నంబరులో




అని కోర్టుకు వివరించిది కూడా. అలాగే చెత్తను చెరువు పరిధిలోకి తీసుకువచ్చి.. జలాలను కాలుష్యం చేస్తున్న విషయం కూడా కోర్టు దృష్టికి హైడ్రా తీసుకెళ్లింది. సర్వే నంబరు సరి చూసుకుని వారికి నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని హైకోర్టు సూచించడంతో..రెండు మూడు రోజుల క్రితం అక్కడ చెత్తను సేకరించేవారు స్వయంగా ఖాళీ చేసి వెళ్లి పోయారు. వారి బదులు.. అక్కడ స్థలాన్ని కొట్టేయాలని చూసే కబ్జాదారుల ప్రయత్నమే ఈ గందరగోళమని హైడ్రా స్పష్టం చేసింది.

## ప్రజల గుండెల్లో నిలిచేది మాటలతో కాదు..
## సమస్యలు పరిష్కరించిన కర్తవ్యంతోనే కొప్పుల నర్సింహ్మా రెడ్డి..!!

ఎల్ బీ నగర్, నవంబర్ 27 (భారత శక్తి): మన్సురాబాద్ డివిజన్ హయత్నగర్ పరిధిలోని వినాయక్ నగర్ కాలనీ రోడ్డు పరిశీలన సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వినాయక్ నగర్ కాలనీ రోడ్ నెం 29,30,31 లో 10,15 సంవత్సరాలు నుండి చిన్న వర్షం వస్తే ముంపుకు గురవుతున్నాయని రోడ్ల సమస్యను ఇచ్చిన హామీ ప్రకారంగా పరిష్కరించామని అన్నారు.అదేవిధంగా రోడ్డుకు అనుగుణంగా రాంపులను,ట్రీ గార్డ్ గోడలను కట్ చేసి రోడ్డు నిర్మాణానికి సహకరించిన కాలనీ వాసులకు అభినందనలు తెలుపుతూ, డివిజన్లో ప్రతి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు వీళ్ళల ఆదర్శంగా ఉండాలని అన్నారు. వెంకటేశ్వర స్కూల్ పక్కన ఉన్న రోడ్డు వెడల్పు సమస్య కాంట్రాక్టర్ తో మాట్లాడి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.వినాయక్ నగర్ కాలనీ రోడ్డు నెం 9, చర్చి వెనుక బాతుకుల శ్రీనివాస్ గౌడ్ ఇంటి నుండి ఆర్టీసీ కాలనీకి



వెళ్ళే రోడ్లు పాడయ్యాయి తొందరలోనే నూతన సిసి రోడ్లు నిర్మిస్తానని తెలియజేశారు.హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ఉన్న దోబీ ఘాట్ వద్ద రజక సంఘ సోదరులకు తాగునీటి లైను, భూగర్భ డ్రైనేజీ పైప్లైన్ కొరకు నా వంతు సహాయంగా కృషి చేస్తానని మీ సమస్య పరిష్కరిస్తానని అన్నారు. అదేవిధంగా దోబీ ఘాట్ వద్ద కావాల్సిన స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడంతో రజక సోదరులు ప్రత్యేక కృతజ్ఞతలు కార్పొరేటర్ కి తెలిపారు..ప్రగతి నగర్ కాలనీలో కాలనీవాసులు తెలియజేసిన సమస్యల ప్రకారంగా ఇంకా మిగిలి ఉన్న కనీసం మౌలిక సదుపాయాలు తొందర్లోనే పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు వెంకటేష్, శ్రీనివాసు,నక్క భాస్కర్ గౌడ్,యుగేందర్ రెడ్డి,స్థానిక రజక సోదరులు స్వామి, దాసు, కాలనీవాసులు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు..




## శబరిమలకు మహా పాదయాత్ర చేసిన వారిని సన్మానించిన కళ్లెం నవ జీవన్ రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 27 (భారత శక్తి): శబరిమల వరకు మహా పాదయాత్రను పూర్తి చేసిన హయత్‌నగర్ వాసులైన యువకులు నక్క రంజిత్ గౌడ్, పిడుగు ప్రవీణ్, మహేష్ నేత, వినయ్ గౌడ్లను నేడు హయత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం జీవన్ రెడ్డి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ "భక్తితో, నియమంతో శబరిమల పాదయాత్ర పూర్తి చేసిన మా హయత్‌నగర్ యువకులు సమాజానికి ఆదర్శం. యువత ధర్మరక్షణ కోసం, సనాతన విలువల కోసం ఎల్లప్పుడూ ముందుకు రావాలి" అని చెప్పారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఎర్ర శ్రీకాంత్, అరుణ్ , బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.